




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 12 సంచిక : 251 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 17 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :251 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 16 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## చంద్రబాబు సంచలన నిర్ణయం... కేవలం ఆన్ లైన్ లోనే మహానాడు!

- పొదుపు చర్యలు ప్రకటించిన ప్రధాని మోదీ
- నెల్లూరులో మహానాడు నిర్వహణకు ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు
- మోదీ పిలుపు నేపథ్యంలో చంద్రబాబు కీలక నిర్ణయం
- హైబ్రిడ్ విధానంలో రెండ్రోజుల పాటు టీడీపీ మహానాడు
- ఎన్టీఆర్ భవన్ లో స్టేజి ఏర్పాటు... రాష్ట్రవ్యాప్తంగా స్క్రీన్లపై ప్రసారం



పెన్ పవర్ డెస్క్:టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఈ ఏడాది కేవలం ఆన్ లైన్ లోనే జరపాలని నిర్ణయించారు.

వాస్తవానికి ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరులో ఘనంగా మహానాడు నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే, ప్రధాని మోదీ పశ్చిమాసియా సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపుపై జాతికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు పొదుపు చర్యలు పాటిస్తూ అందరికీ

- మిగతా 2లో




- చిన్న చేపల అరెస్ట్‌తో కేసు ముగిసిందా..?
- అసలు తిమింగలాలు ఇంకా బయటేనా..?
- సెటిల్మెంట్ సామ్రాజ్యానికి రాజకీయ అండ ఎవరిది..?
- పోలీస్-మధ్యవర్తులు-నే తల మధ్య గోప్య ఒప్పందాలేమిటి..?
- డీఎస్పీ కార్యాలయం వరకు విస్తరించిన అంతర్గత లింకులపై సంచలన ఆరోపణలు
- గూడెంలో బయటపడని పేర్లు..!
- తదుపరి ఎపిసోడ్‌లో మరిన్ని పేర్లు..?

- మిగతా 2లో

ఎడిటర్, పెన్ పవర్ తాడేపల్లి గూడెం/ భీమవరం మే 15:

ఒక ఎస్సై అరెస్ట్‌తో కథ ముగిసిందని భావించినవారికి గూడెం వ్యవహారం ఇప్పుడు మరింత మరో పెద్ద మలుపు తిరుగుతుంది. బయటకు కనిపించింది చిన్న చేప మాత్రమేనని... అసలు తిమింగలాలు ఇంకా నీటిలోనే తిరుగుతున్నాయనే చర్చ గూడెం రాజకీయ, పోలీస్, మధ్యవర్తుల వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సెటిల్మెంట్ రాజకీయం, అధికార దుర్వినియోగం, కోట్ల రూపాయల డీల్స్ వెనుక ఉన్న అసలు శక్తులు ఎవరు అన్న దానిపై పెన్ పవర్ లోతైన పరిశీలన ప్రారంభించింది.



## తొలకరి కబురు... ఈ నెల 26నే కేరళకు రుతుపవనాలు

- ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రానున్నాయని ఐఎండీ ప్రకటన
- సాధారణ తేదీ జూన్ 1 కాగా, మే 26నే కేరళను తాకే అవకాశం
- నాలుగు రోజులు అటూఇటూగా ఉండొచ్చని తెలిపిన భారత వాతావరణ శాఖ
- ఆధునిక స్టాటిస్టికల్ మోడల్ ఆధారంగా ఈ అంచనాను విడుదల చేసిన ఐఎండీ
- గత 21 ఏళ్లలో ఐఎండీ అంచనాలు ఒక్కసారి మినహా దాదాపుగా నిజ

దేశవ్యాప్తంగా ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ (IMD) చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే దేశంలోకి ప్రవేశించ నున్నాయని అధికారికంగా ప్రకటించింది.

వివరాలు 2లో..



## గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ.. పవన్ కల్యాణ్ ప్రశంసలు

- పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన
- చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్
- పారిశ్రామికంగా ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య

- మిగతా 2లో



## రక్షణ హబ్‌గా రాయలసీమ.. పుట్టపర్తిలో స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టుకు భూమిపూజ...

- పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు
- రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఐదో తరం యుద్ధ విమానాల తయారీ
- రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని సీఎం హామీ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను రక్షణ, వైమానిక రంగంలో కీలక కేంద్రంగా మార్చే దిశగా శుక్రవారం భారీ ముందడుగు పడింది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సుమారు రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన

- మిగతా 2లో

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు... వాళ్లది పవర్ ఫుల్ కాంబో

- పుట్టపర్తిలో ఏఎంసీఏ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్‌కు భూమిపూజ
- మోదీ, రాజ్ నాథ్, చంద్రబాబు 75 ఏళ్ల కుర్రాళ్లు అంటూ లోకేష్ ప్రశంసలు
- వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ తట్టుకోలేమన్న లోకేష్
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఐరన్ మ్యాన్‌గా అభివర్ణన



పెన్ పవర్ డెస్క్:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు.. వీరంతా 75 ఏళ్ల కుర్రాళ్లు

- మిగతా 2లో

## వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే నీట్ యూజీ

- వచ్చే ఏడాది నుంచి నీట్ యూజీ పరీక్ష పూర్తిగా కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహణ
- పేపర్ లీకేజీతో రద్దయిన పరీక్షను జూన్ 21న మళ్లీ నిర్వహించనున్నట్లు ప్రకటన
- నీట్ పేపర్ లీకేజీపై సీబీఐతో లోతైన విచారణకు ఆదేశించినట్లు తెలిపిన కేంద్రమంత్రి
- రీ-ఎగ్జామ్ కోసం విద్యార్థులకు ఫీజు వాపస్, ఉచితంగా పరీక్ష నిర్వహణ
- పరీక్షకు వారం ముందు సెంటర్ సిటీని ఎంచుకునే వెసులుబాటు

- మిగతా 2లో





## యూఏఈ పర్యటనలో ప్రధాని మోదీ..

### కీలక ఒప్పందాలపై సంతకాలు

- పశ్చిమాసియా సంక్షోభం వేళ యూఏఈలో ప్రధాని మోదీ పర్యటన
- ఇంధన భద్రత, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే ప్రధాన లక్ష్యం
- ఎల్‌పీజీ, పెట్రోలియం నిల్వలపై కుదిరిన కీలక ఒప్పందాలు
- భారత్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు యూఏఈ అంగీకారం
- గుజరాత్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు మరో కీలక ఎంఓయూ

వివరాలు 2లో..




## పోక్సో కేసులో.. కానిస్టేబుల్ కు 30 ఏళ్ల జైలు శిక్ష

పెన్ పవర్ డెస్క్: బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో నమోదైన పోక్సో కేసులో సంచలన తీర్పు చెప్పింది పోక్సో స్పెషల్ కోర్టు. ఈ కేసులో దోషిగా తేలిన కానిస్టేబుల్ కు 30ఏళ్ల జైలు శిక్ష విధించింది. బాధిత మైనర్ కు లక్ష రూపాలయ పరిహారం

- మిగతా 2లో

## 'చేప ప్రసాదం' కోసం సిద్ధమవుతున్న హైదరాబాద్

- ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా జరిగే మృగశిర కార్తె చేప ప్రసాదం కార్యక్రమం
- ఆస్తమా, శ్వాసకోశ సమస్యలలో బాధ పడేవారికి ఔషధంగా చేప ప్రసాదం
- ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్



- మిగతా 2లో

## పోక్సో కేసులో బండి సంజయ్ ఫొటోలు, వీడియోల వాడొద్దు.. సిటీ సివిల్ కోర్టు ఆదేశం

పెన్ పవర్ డెస్క్: తన కొడుకు బండి భగీరథ్ కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ ఫొటోలు, వీడియోలు వాడొద్దని సిటీ సివిల్ కోర్డు ఆదేశాలు జారీ చేసింది. బండి భగీరథ్ కేసులో తన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో, యూట్యూబ్




- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే నీట్ యూజీ

దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ (చీజుజు ఖ+) పరీక్షా విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక సంస్కరణను ప్రకటించింది. వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్షను పూర్తిగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. జాతీయ ప్రవేశ పరీక్షల వ్యవస్థలో ఇది ఒక ప్రధాన సంస్కరణగా నిలవనుంది. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పేపర్ లీకేజీ కారణంగా రద్దు చేసిన నీట్ యూజీ 2026 పరీక్షను తిరిగి జూన్ 21న నిర్వహించనున్నట్లు ధ్రువీకరించారు. దీనికి సంబంధించిన అడ్మిట్ కార్డులను జూన్ 14 నాటికి జారీ చేస్తామని తెలిపారు. మే 3న పరీక్ష నిర్వహించగా, మే 7న "గెస్ పేపర్" గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయని, కొద్ది రోజుల్లోనే పేపర్ లీక్ అయినట్లు అధికారులు నిర్ధారించారని ఆయన వివరించారు. "లీకేజీ వాస్తవమని తేలిన వెంటనే, విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకూడదని నిర్ణయించుకుని మే 12న పరీక్షను రద్దు చేశాం" అని ప్రధాన్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలను, అసాంఘిక శక్తులను ఏమాత్రం సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ పేపర్ లీకేజీ ఘటనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) తో లోతైన విచారణ జరిపిస్తామని, దీని మూలాలను కనుగొనాలని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. "కష్టపడి చదివే విద్యార్థుల సీట్లను ఏ మాఫియా కూడా లాక్కోవడానికి వీల్లేదు. విద్యార్థుల నమ్మకమే మాకు అత్యంత ముఖ్యం" అని ఆయన అన్నారు. గతంలో ఇలాంటి సంఘటనల నేపథ్యంలోనే రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఆ కమిటీ సిఫార్సులను అమలు చేసినప్పటికీ, పరీక్షల నిర్వహణలో లోపం జరిగిందని అంగీకరించారు. సుప్రీంకోర్టు సిఫార్సు మేరకు ఏర్పాటైన ఎన్‌టీఏలో నిరంతర సంస్కరణలు జరుగుతున్నాయని, 'జీరో-ఎర్రర్' పరీక్షల నిర్వహణకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రద్దయిన పరీక్షకు హాజరైన అభ్యర్థులకు వారి పరీక్ష ఫీజును తిరిగి వాపసు ఇస్తామని, త్వరలో నిర్వహించే రీ-ఎగ్జామ్‌ను ఉచితంగా నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం పరీక్షకు వారం రోజుల ముందు తమకు నచ్చిన పరీక్షా నగరాన్ని ఎంచుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వీలైనంత వరకు రవాణా సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

## రక్షణ హబ్‌గా రాయలసీమ.. పుట్టపర్తిలో స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టుకు భూమిపూజ...

- మొదటి పేజి తరువాయి

చేశారు. ఈ కార్యక్రమం ద్వారా దేశీయంగా ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్‌ల అభివృద్ధి, తయారీకి మార్గం సుగమం కానుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు అనకాపల్లి జిల్లాలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) నావల్ సిస్టమ్స్ యూనిట్, కర్నూలులో ఏర్పాటు చేయనున్న 'డ్రోన్ సిటీ' సహా మొత్తం రూ.4,145 కోట్ల విలువైన మరో 12 రక్షణ ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. దేశానికి ఆంధ్రప్రదేశ్ రక్షణ కవచంగా నిలుస్తోందన్నారు. "ఒకప్పుడు రతనాల సీమగా ఉన్న రాయలసీమను మళ్లీ అదే స్థాయికి తీసుకెళ్లే బాధ్యత నాది. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి పూర్తి చేసి సీమకు కానుకగా ఇస్తాం," అని ఆయన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన రక్షణ ఉత్పత్తుల ప్రదర్శనను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి లోకేష్ తిలకించారు. ఇందులో అత్యాధునిక క్షిపణులు, తుపాకులు, హ్యాండ్ గ్రెనేడ్లు, యుద్ధ విమానం ప్రోటోటైప్‌లను పరిశీలించారు. ఈ ప్రాజెక్టులను డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) అభివృద్ధి చేస్తోంది.

## పోక్సో కేసులో బండి సంజయ్ ఫొటోలు, వీడియోల వాడొద్దు.. సిటీ సివిల్ కోర్టు ఆదేశం

- మొదటి పేజి తరువాయి

ఛానళ్లలో వాడుతూ తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని వెంటనే ఫొటోలు, వీడియోలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు బండి సంజయ్. విచారణ చేపట్టిన కోర్టు.. ఈ కేసులో బండి సంజయ్ ఫొటోలు,వీడియోలు వాడొద్దని, అలా వాడితే మీడియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. తన కొడుకు బండి భగీరథ్ కేసులో తన పేరు, ఫొటోలు, వీడియోలు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని శుక్రవారం (మే15) హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు కేంద్ర మంత్రి బండి సంజయ్. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రచారం జరుగుతోందని తన పేరుతో ఇప్పటివరకు సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానళ్లలో ఉన్న వీడియోలను తొలగించాలని కోర్టును కోరారు. మంత్రి బండి సంజయ్ పిటిషన్ విచారణ చేపట్టిన సిటీ సివిల్ కోర్టు ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

బండి భగీరథ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ పేరును వాడొద్దంటూ గ్యాగ్ ఆర్డర్ జారీ చేసి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు..?బండి భగీరథ కేసు విషయంలో బండి సంజయ్ పేరును ఎక్కడా ఉపయోగించరాదని స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో ఇప్పటివరకు అప్లోడ్ చేసిన వీడియోలను డిలీట్ చేయాలని, అలా చేయకుంటే అలాంటి మీడియాపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

# పరిధి దాటుతున్న తిమింగలాలు..!




**1. అసలు తిమింగలం ఎక్కడ?**
కేసులో ఇప్పటికే ఒకరిపై చర్యలు జరిగినప్పటికీ... అసలు వ్యవహారాన్ని నడిపించిన కీలక వ్యక్తులు ఇంకా బయటే ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం ఫీల్డ్ స్థాయిలో పనిచేసిన వారినే బలి పశువులుగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి.

**2. రాజకీయ శక్తుల అండ ఎవరికీ?**
గూడెం పరిధిలో కొందరు ప్రజాప్రతినిధుల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ నేతల పేర్లు కూడా చర్చకు వస్తుండటం సంచలనంగా మారింది. సెటిల్మెంట్ల ద్వారా వచ్చిన డబ్బు ఎక్కడికి వెళ్లిందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

3. సెటిల్మెంట్ బ్యాచ్ అసలు నాయకత్వం ఎవరి చేతుల్లో?
స్థానికంగా పని చేసే కొందరు వ్యక్తులు కేవలం ఫ్రంట్ మాత్రమేనని... అసలు ఆదేశాలు మరో కేంద్రం నుంచి వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. బాధితులు కూడా ఇదే విషయాన్ని ప్రైవేట్‌గా చెబుతున్నట్టు సమాచారం.

**4. మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న కీలక వ్యక్తులు ఎవరు?**
వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వర్గాలు, కొందరు స్థానిక ప్రభావశీలులు... వివాదాల్లో రాజీ పేరుతో రంగంలోకి దిగుతున్నట్టు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌కు వెళ్లకముందే డీల్స్ క్లోజ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**5. ప్రభుత్వ శాఖల్లో మరిన్ని తిమింగలాలున్నాయా?**
రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ విభాగాల్లో కొన్ని అనుమానాస్పద లింకులపై ఇప్పుడు చర్చ నడుస్తోంది. ఫైళ్లు కదలడానికి ప్రత్యేక వ్యవస్థ పని చేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

6. పోలీస్--రాజకీయ--మధ్యవర్తుల లింకులు
ఈ మూడు వర్గాలు కలిసి పనిచేశాయా? అనే అనుమానం బలపడుతోంది. బాధితుల ఫిర్యాదులు ఎందుకు నమోదు కాలేదన్న ప్రశ్నలు ఇప్పుడు కీలకంగా మారాయి.

**7. పోలీస్ శాఖలో అసలు అవినీతి తిమింగలం ఎవరు?**
కీలక అధికారుల పేర్లు బయటకు రాకుండా తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం ఉంది. లోపలి విచారణలో కీలక విషయాలు బయటకు రావచ్చని సమాచారం.

**8. "బాదం పప్పు" నుంచి డీఎస్పీ కార్యాలయం లో అప్పా వరకు ఉన్న రహస్య సంబంధం ఏంటి?**
స్థానికంగా కోడ్ పేర్లతో వ్యవహరించే కొందరు వ్యక్తులు ఉన్నారన్న ప్రచారం ఉంది. డీఎస్పీ కార్యాలయం వరకు లింకులు ఉన్నాయా? అన్న కోణంలో కూడా పరిశీలన జరుగుతోందని సమాచారం.

**9. "పరిధి దాటుతున్నావ్... జాగ్రత్త" అంటూ**
ఇటీవల ఓ సీ ఐ స్థాయి అధికారి ఆ తిమింగలానికి వార్నింగ్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ హెచ్చరిక ఎవరికి? ఎందుకు? అన్నది ఇప్పుడు ఆసక్తికర అంశంగా మారింది.

**10. నాయకుడి ఇంటి వద్ద ఎందుకు కాపలా?**
శుక్రవారం ఉదయం నుంచి ఓ కీలక రాజకీయ నాయకుడి ఇంటి వద్ద ఆ పప్పు తిమింగలం పడిగాపులు కాస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం ప్రకారం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఏదైనా కీలక డ్యామేజ్ జరగకుండా ఆ నాయకుడు కంట్రోల్ చేస్తాడనే ఆశ తో ఆ పప్పు చేయని ప్రయత్నాలు లేవని ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బాధితులు ముందుకు వస్తారా? :**
ఇప్పటివరకు భయంతో నోరు విప్పని పలువురు బాధితులు ఇప్పుడు బయటకు రావడానికి సిద్ధమవుతున్నారన్న సమాచారం కూడా ఉంది. మరిన్ని ఫిర్యాదులు మరికొన్ని తిమింగలాలపై వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.
ఈ వ్యవహారంలో పేర్లు బయటకు రాని అసలు సూత్రధారులు ఎవరు?
ఎవరెవరు ఎంత సంపాదించారు?
ఎవరెవరు రక్షణ కల్పించారు?
**అన్న అంశాలపై పెన్ పవర్ వచ్చే ఎపిసోడ్‌లో మరిన్ని సంచలన విషయాలు ...!?**

**"చిన్న చేపలు చిక్కాయి... అసలు తిమింగలాలు ఎప్పుడు?" అన్నదే ఇప్పుడు గూడెం ప్రజల ప్రశ్న.... మరి ఆ తిమింగలాలు ఏసీబీ వాళ్లకు చిక్కుతాయా లేక తప్పించుకుంటాయా వేచి చూడాల్సిందే...**

# యూఏఈ పర్యటనలో ప్రధాని మోదీ.. కీలక ఒప్పందాలపై సంతకాలు

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఇంధన సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటిస్తున్నారు. దేశంలో నాలుగేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన తరుణంలోనే ఈ పర్యటన జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ ఇంధన భద్రతను పటిష్ఠం చేసుకోవడం, ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.
అబుదాబిలో యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన భద్రత, రక్షణ సహకారం, ప్రజా సంబంధాలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ), వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలకు సంబంధించి రెండు ముఖ్యమైన అవగాహన ఒప్పందాలపై (ఎంఓయూ) సంతకాలు జరిగాయి. వీటితో పాటు ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌పైనా అంగీకారానికి వచ్చారు. గుజరాత్‌లోని ద్వారక జిల్లా వడినార్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించిన ఎంఓయూపైనా సంతకాలు చేశారు. ఈ ఒప్పందాలతో పాటు భారత మౌలిక సదుపాయాలు, ఆర్‌బీఎల్ బ్యాంక్, సమ్మాన్ క్యాపిటల్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు యూఏఈ ప్రకటించింది. ఇది భారత్ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తుందని భావిస్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో యూఏఈపై ఇరాన్ జరిపిన దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గల్ఫ్ ప్రాంతంలో భారత్‌కు కీలక భాగస్వామిగా ఉన్న యూఏఈతో ఈ తాజా ఒప్పందాలు వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చనున్నాయి. సుమారు 45 లక్షల మందికి పైగా భారతీయులు నివసిస్తున్న యూఏఈలో వారి సంక్షేమం గురించి కూడా ఈ పర్యటనలో చర్చకు వచ్చింది. ప్రస్తుత సంక్షోభ సమయంలోనూ యూఏఈ భారత్‌కు అత్యంత నమ్మకమైన ఇంధన భాగస్వామిగా కొనసాగుతుండటం గమనార్హం.

# 'చేప ప్రసాదం' కోసం సిద్ధమవుతున్న హైదరాబాద్

హైదరాబాద్‌లో ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగే 'మృగశిర కార్తె చేప ప్రసాదం' పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈ ఏడాది జూన్ 8వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.
హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ ప్రియాంక, బత్తిన కుటుంబ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఈ కార్యక్రమానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని మంత్రి పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ మేనేజ్మెంట్, క్యూ లైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దశాబ్దాలుగా బత్తిన గౌడ్ కుటుంబం ఈ చేప ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఉబ్బసం, ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి ఇది గొప్ప ఉపశమనాన్ని ఇస్తుందని భక్తుల నమ్మకం. ఒక చిన్న బతికున్న చేప పిల్ల నోటిలో మూలికా మిశ్రమాన్ని ఉంచి, దానిని రోగి చేత మింగిస్తారు. చేపలు తీసుకోని వారి కోసం బెల్లంతో కలిపిన ప్రత్యేక మూలికా మిశ్రమాన్ని అందిస్తారు.

## తొలకరి కబురు... ఈ నెల 26నే కేరళకు రుతుపవనాలు

- మొదటి పేజి తరువాయి

సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు, ఈసారి ఐదు రోజులు ముందుగా, అంటే మే 26నే తీరాన్ని తాకే అవకాశం ఉందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం, ఈ తేదీకి నాలుగు రోజులు అటూఇటూగా రుతుపవనాలు కేరళలో ప్రవేశించవచ్చు. అంటే మే 22 నుంచి మే 30 మధ్య ఎప్పుడైనా నైరుతి రుతుపవనాల రాక ఉండొచ్చని అర్థం చేసుకోవాలి. రుతుపవనాల ఆగమనంతో ప్రస్తుతం దేశవ్యాప్తంగా నమోదవుతున్న తీవ్ర ఉష్ణోగ్రతల నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. వేసవి కాలం ముగిసి, వర్షాకాలం ప్రారంభానికి ఇది సూచికగా నిలుస్తుంది. ఐఎండీ 2005 నుంచి కేరళలో రుతుపవనాల ప్రవేశ తేదీపై అంచనాలను వెలువరిస్తోంది. ఇందుకోసం దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యాధునిక స్టాటిస్టికల్ మోడల్‌ను ఉపయోగిస్తోంది. వాయువ్య భారతదేశంలో కనీస ఉష్ణోగ్రతలు, ద్వీపకల్పంలో రుతుపవనాలకు ముందు కురిసే వర్షపాతం, ఆగ్నేయ హిందూ మహాసముద్రంలోని గాలుల వేగం సహా మొత్తం ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అంచనాను రూపొందిస్తారు. గత 21 సంవత్సరాలుగా (2005-2025) ఐఎండీ విడుదల చేసిన అంచనాలు దాదాపుగా కచ్చితంగా ఉన్నాయి. కేవలం 2015లో మాత్రమే అంచనా తప్పింది. గత ఆరేళ్ల గణాంకాలను పరిశీలిస్తే, వాస్తవ తేదీకి, అంచనా తేదీకి కేవలం ఒకటి రెండు రోజుల తేడా మాత్రమే ఉండటం ఈ మోడల్ కచ్చితత్వానికి నిదర్శనం. ఈ నేపథ్యంలో తాజా అంచనా కూడా నిజమై, దేశ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు సకాలంలో ఊరట లభిస్తుందని అందరూ ఆశిస్తున్నారు.

## చంద్రబాబు సంచలన నిర్ణయం... కేవలం ఆన్ లైన్ లోనే మహానాడు!

- మొదటి పేజి తరువాయి

ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పుడు మహానాడును ఆన్ లైన్ లో హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని ప్రకటించడం ద్వారా ఆ పొదుపు చర్యలను మరింత ముందుకు తీసుకెళ్లారు. ఆన్ లైన్ లో మహానాడును ఈ నెల 27, 29 తేదీల్లో నిర్వహించనున్నారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ లో ఒక వేదిక నిర్మించి దానిపై పొలిట్ బ్యూరో సభ్యులు ప్రసంగించనున్నారు. ఈ హైబ్రిడ్ మహానాడు కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో ఎలక్ట్రానిక్ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నారు.

## పోక్సో కేసులో.. కానిస్టేబుల్ కు 30 ఏళ్ల జైలు శిక్ష

- మొదటి పేజి తరువాయి

ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. వివరాల్లోకి వెళితే..
హైదరాబాద్ సిటీ పరిధిలోని బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో నమోదైన మైనర్ పై కానిస్టేబుల్ అత్యాచారం కేసులో శుక్రవారం (మే15) పోక్సో స్పెషల్ కోర్టు తీర్పు చెప్పింది. ఈ కేసులో నిందితుడైన కానిస్టేబుల్ వరదరాజ్ సుదేశ్ ను పై నమోదు అత్యాచారం కేసులో నేరం రుజువు కావడంతో పోక్సో ప్రత్యేకకోర్టు వెల్లడించింది. కానిస్టేబుల్ వరదరాజ్ సుదేశ్ కు 30 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ12వేల జరిమానా విధించింది. బాధితురాలికి 1లక్ష రూపాయలు పరిహారంగా ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

## గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ.. పవన్ కల్యాణ్ ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో నిలిపే దిశగా రూ. 15,803 కోట్ల భారీ పెట్టుబడితో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా ప్రాజెక్టులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీ పారిశ్రామిక చరిత్రలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు.
శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో ఏర్పాటు కాబోతున్న 'ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్' దేశ రక్షణలో కీలకం కానుంది. స్వదేశీ సాంకేతికతతో తయారవుతున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా' ప్రాజెక్టులో ఏపీ భాగస్వామ్యం కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రధాని మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 7,500 మంది యువతకు హై-వాల్యూ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కేవలం విమానాల తయారీ మాత్రమే కాకుండా, రాష్ట్రంలో అత్యాధునిక 'డ్రోన్ ఎకోసిస్టమ్'ను అభివృద్ధి చేయడం ద్వారా డ్రోన్ టెక్నాలజీలో కూడా ఏపీ అగ్రగామిగా నిలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని పవన్ కొనియాడారు. ఈ భారీ ప్రాజెక్టు ఏపీకి రావడానికి సహకరించిన ప్రధాని మోదీకి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు... వాళ్లది పవర్ ఫుల్ కాంబో

- మొదటి పేజి తరువాయి

అంటూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారి వయసు 75 ఏళ్లయినా, వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ చూస్తుంటే తనకు ఆశ్చర్యం వేస్తుందని అన్నారు. ఈ ముగ్గురి వేగాన్ని తట్టుకోవడం ఎవరి వల్లా కాదని లోకేష్ వ్యాఖ్యానించారు. వీరిది పవర్ ఫుల్ కాంబినేషన్ అని కొనియాడారు.
పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలిసి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్ర మారబోతోందని లోకేష్ అన్నారు. రక్షణ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, పాకిస్థాన్‌కు గట్టి జవాబిచ్చిన 'ఆపరేషన్ సిందూర్'ను గుర్తుచేస్తూ, దాని వెనుక ఉన్న అసలైన శక్తి, ఐరన్ మ్యాన్ కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ అని లోకేష్ ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా ఏపీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా


# వార్డులో అభివృద్ధి పరిశీలించిన బొండా



**కూర్మన్న పాలెం:పెన్ పవర్,మే15:**మహావిశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డు పరిధి ఆటోనగర్లో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ కొరకు జరుగుతున్న నిర్మాణపు పనులను పరిశీలించిన మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ , జీవీఎంసీ కమిషనర్ కేతన్ గర్గ్ , రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్టర్ ను కలిసి జరుగుతున్న పనుల్లో నాణ్యత తగ్గకుండా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో సిఈ సత్యనారాయణ, సీఎంహెచ్వో. ఏం హెచ్ వో కిరణ్ కుమార్. ఈఈ రాయల్ బాబు,డిఈ ఎంఆర్ఎస్ అప్పారావు, జీవీఎంసీ సిబ్బంది, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# డాక్యుమెంట్ రైటర్ల చేతిలో "కీలుబొమ్మ" గోపాలపట్నం సబ్‌రిజిస్ట్రార్!



- "డాక్యుమెంట్ రైటర్లు శాసిస్తారు.. సబ్‌రిజిస్ట్రార్ పాటిస్తారనే ఆరోపణలు!
- లింక్ డాక్యుమెంట్లు చూడకుండానే రిజిస్ట్రేషన్లు?
- "కప్పం" కట్టకపోతే ఫైల్ కదలదంటున్న బాధితులు!
- రోజుకు లక్షల్లో అక్రమ వసూళ్లు?
- కమిషన్లు నేరుగా సబ్ రిజిస్టర్ ఇంటికేనంటున్న రైటర్లు!

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మే 15 :** స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో వ్యవస్థీకృత అవినీతి నెట్‌వర్క్‌పై తీవ్ర ఎక్కువగా ఉంది. విశాఖ నగరంలోని గోపాలపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం డాక్యుమెంట్ రైటర్లు, దళారులు, ప్రైవేట్ మధ్యవర్తుల ఆధీనంలో నడుస్తోందన్న తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయంగా కాకుండా, కొందరు ప్రైవేట్ వ్యక్తుల ఆదేశాలతో నడిచే కేంద్రంగా మారిపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "డాక్యుమెంట్ రైటర్లు శాసిస్తారు.. సబ్‌రిజిస్ట్రార్ పాటిస్తారు" అన్న విమర్శలు స్థానికంగా బలంగా వినిపిస్తున్నాయి. భూముల రిజిస్ట్రేషన్, గిఫ్ట్ డీడ్‌లు, సేల్ డీడ్‌లు, వారసత్వ పత్రాలు, మ్యూటేషన్లు, ఎంకంబరెన్స్‌కు సంబంధించిన పనుల్లో అధికారిక ఫీజులకు మించి భారీగా వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కొందరు డాక్యుమెంట్ రైటర్లతో సబ్‌రిజిస్ట్రార్‌కు ప్రత్యేక అనుబంధం ఉండటంతో, వారు చెప్పిందే కార్యాలయంలో చట్టంలా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. అత్యంత తీవ్ర ఆరోపణ ఏమిటంటే.. కొందరు ప్రభావశీల డాక్యుమెంట్ రైటర్లు, దళారుల మిలాఖత్‌తో పలు రిజిస్ట్రేషన్లు పూర్తి స్థాయి ధృవీకరణ లేకుండానే జరుగుతున్నాయనేది. భూమికి సంబంధించిన పాత లింక్ డాక్యుమెంట్లు, యాజమాన్య హక్కుల ధృవీకరణ, లిటిగేషన్ అంశాలు పూర్తిగా పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

సాధారణ ప్రజలు ఒక చిన్న తప్పిదం చేసినా ఫైళ్లు రోజుల తరబడి పెండింగ్‌లో పెడుతుంటే, కొందరు ప్రత్యేక వ్యక్తుల ఫైళ్లు మాత్రం గంటల్లో క్లియర్ అవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల భవిష్యత్తులో పెద్ద ఎత్తున భూ వివాదాలు తలెత్తే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా కూడా "మామూలు" పేరుతో అదనపు వసూళ్లు తప్పడం లేదని బాధితులు చెబుతున్నారు. కార్యాలయంలో నేరుగా ఎవరూ డబ్బు అడగకపోయినా, బయట కూర్చునే డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తుల ద్వారా ముందుగానే రేట్లు నిర్ణయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. "అన్నీ సరిగ్గా ఉన్నాయనుకోవద్దు... పని సాఫీగా జరగాలంటే ఇవ్వాల్సిందే" అంటూ ముందుగానే హెచ్చరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఈ అక్రమ వసూళ్లు చెల్లించకపోతే చిన్న చిన్న అభ్యంతరాలు చూపిస్తూ ఫైళ్లను నిలిపివేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన ఏసీబీ తనిఖీల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో భారీ అవినీతి వ్యవస్థ వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. కొన్ని కీలక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్టు సమాచారం. అదే తరహా వ్యవస్థ గోపాలపట్నం కార్యాలయంలో కూడా నడుస్తోందని ఆరోపణలున్నాయి. నగర పరిధిలోని విలువైన భూముల రిజిస్ట్రేషన్లలో భారీ మొత్తాలు చేతులు మారుతున్నాయనే చర్చ జరుగుతోంది. సాధారణ రిజిస్ట్రేషన్‌కే రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారని, వివాదాస్పద భూముల విషయంలో ఈ మొత్తం లక్షల్లో ఉంటోందని అంటున్నారు. కొందరు డాక్యుమెంట్ రైటర్లు వసూలు చేసిన డబ్బును నేరుగా అధికారుల ఇళ్లకు చేరవేస్తున్నారనే ఆరోపణలు మరింత సంచలనం రేపుతున్నాయి. కార్యాలయంలో నగదు లావాదేవీలు బయటపడకుండా కోడ్ భాషలో వ్యవహారాలు నడుపుతున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. కార్యాలయ సిబ్బంది కంటే బయట ఉన్న ప్రైవేట్ వ్యక్తులకే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోందని, ఎవరికి ఫైల్ ముందుకు వెళ్లాలి? ఎవరికి ఆపాలి? అనే విషయాలు కూడా వారే నిర్ణయిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మధ్యతరగతి ప్రజలపై భారీ భారం జీవితాంతం కూడబెట్టిన డబ్బుతో చిన్న స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకునే సామాన్య ప్రజలకు ఈ వ్యవస్థ పెద్ద భారంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టబద్ధ ఫీజులు చెల్లించిన తర్వాత కూడా అదనంగా వేల రూపాయలు చెల్లించాల్సి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వారసత్వ పత్రాలు, మ్యూటేషన్లు, గిఫ్ట్ డీడ్‌లు, ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ల వంటి సాధారణ సేవలకు కూడా మధ్యవర్తుల జోక్యం పెరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం, ఏసీబీ కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్. గోపాలపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విజిలెన్స్, ఏసీబీ దర్యాప్తు జరపాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించడంతో పాటు, అన్ని రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్నారు. డాక్యుమెంట్ రైటర్లు, దళారులు, అధికారుల కుమ్మక్కుతో ఏర్పడిన అవినీతి నెట్‌వర్క్‌ను ఛేదించకపోతే భవిష్యత్తులో భూ రిజిస్ట్రేషన్ వ్యవస్థపై ప్రజల విశ్వాసం పూర్తిగా దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## హౌసింగ్ బిల్లులకై నిరసన - కలెక్టర్ కు వినతి




- పీవీటీజీలకు ఇల్లు యూనిట్ కాస్ట్ 5 నుంచి 10 లక్షల వరకు పెంచాలి.
- గృహలబ్ధిదారులకు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుండి 1లక్ష రూపాయలు వెంటనే చెల్లించాలి.
- గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 15.**గిరిజన ప్రాంతంలో పీఎం జన్మన్ గృహ లబ్ధిదారులకు తక్షణమే ఇల్లు బిల్లులు చెల్లించాలని, క్యాస్ట్ సర్టిఫికెట్ ద్వారా వచ్చే డబ్బులు వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘం ముంచంగిపుట్టు మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గృహ లబ్ధిదారులకు పెంచిన లక్షరూపాయలతో పాటు, ఒక్కొక్క గృహ నిర్మాణానికి ఐదు నుంచి పది లక్షలు కేటాయించాలని పాడేరు ఐటిడిఏ గ్రీవెన్స్ లో సమావేశ ప్రధాన కార్యాలయం బయట ఆదివాసి పివిటిజి గిరిజనులతో నిరసన వ్యక్తం చేశామన్నారు. ఇల్లు నిర్మించుకునే ప్రతి పీవీటిజి గిరిజనులకు ఇల్లు యూనిట్ కాస్ట్ 5 లక్షల నుండి 10 లక్షలు వరకు పెంచాలని, పెరిగిన ఇసుక రేట్లు ఇటుకలు రేట్లు ఐరన్ రేట్లు తగ్గట్టుగానే డబ్బులు పది లక్షల రూపాయలు ఇవ్వాలని నినాదాలు చేస్తూ, ఆదివాసి గిరిజన ప్రాంతంలో ఎటువంటి షరతులు విధించకుండా పీఎం జన్మన్ లబ్ధిదారులకు డబ్బులు సకాలంలో అకౌంట్లు జమ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఐటీడీఏ ఎదుట చేసిన నిరసనపై కలెక్టర్ స్పందిస్తూ గ్రీవెన్స్ హాల్ లోపల పిలిచి మా యొక్క సమస్యలు ఏమిటో అడిగి తెలుసుకున్నారనీ, ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసి ఉన్నదని అది త్వరలో మీకు ఆ డబ్బులు అందుతుందని తెలిపినట్లు ఎం ఎం శ్రీను వెల్లడించారు. గృహ నిర్మాణ శాఖ జిల్లా పిడి బాబు నాయక్ తో పిలిచి ముఖాముఖి చర్చలు జరిపి త్వరలోనే మీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పీఎం జన్మన్ గృహ బాధితులు కొంతమంది వారి పేర్లు ప్రపోజర్ సైట్ లో ఉన్నదని, అది కూడా క్లియర్ చేయాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసా ఉపాధ్యక్షులు కిల్లో నారాయణ, కొంజియ జయరాం, ఫివిటిజి గిరిజనులు గొల్లూరి రామ్మూర్తి, గొల్లూరు సాయిబాబా, ప్రహ్లాదు, కిలో కృష్ణారావు, చైతోన్, ధర్మారావుతో పాటు 100 మంది గిరిజనులు పాల్గొన్నారు. భవిష్యత్తులో ఈ సమస్య పరిష్కారం చేయకపోతే దశల వారి ఆందోళన చేపడుతామని కలెక్టర్ కు విన్నవించామని తెలిపారు.

# చంద్రబాబు మాటలు ఒకటి చేతలు మరొకటి

**మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శలు**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 15 :**రాష్ట్రంలో పొదుపు చర్యల పేరుతో ప్రజలకు సూచనలు చేస్తున్న ముఖ్యమంత్రి స్వయంగా వాటిని పాటించడం లేదని వైఎస్సార్సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి విమర్శించారు. విశా ఖలోని పార్టీ సిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, టీడీపీ నా యకత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ప్రధాని ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపును కూడా సీఎం చంద్రబాబు కేవలం ప్రచారానికే వినియోగిస్తున్నారని అమర్‌నాథ్ ఆరోపించారు. ఒకవైపు దుబారా ఖర్చులు తగ్గించాలని ప్రజ లకు సూచిస్తూ, మరోవైపు చంద్రబాబు మరి యు మంత్రి ప్రత్యేక విమానాల్లో పుట్టపర్తికి వెళ్లడం విరుద్ధ వైఖరికి నిదర్శనమన్నారు.

క్యాబినెట్ సమావేశాల్లో పొదుపు చర్యలపై ప్రకటనలు చేస్తూనే, సీఎం కార్యాలయ ఖర్చు లు, అధికారిక నివాసాల మరమ్మతుల పేరిట కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని విమర్శిం చారు. ప్రజలకు పొదుపు సందేశాలు ఇస్తున్న ప్రభుత్వం, మరోవైపు ప్రత్యేక విమానాలు, భారీ కాన్వాయ్‌లు, హెలికాప్టర్ల వినియోగంతో ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తోందన్నారు.టీడీపీ పాలనలో ప్రచారం తప్ప అభివృద్ధి కనిపించడం లేదని, గత రెండేళ్లలో భారీగా అప్పులు చేసినా సంక్షేమ పథకాలు అమలు కాలేదని గుడివాడ అమర్ నాథ్ ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని, పాలన మొత్తం ప్రచార హంగులతోనే కొనసాగుతోందన్నారు.

వైఎస్సార్సీపీ సిద్ధాంతాలపై మాట్లాడిన ఆయన, పార్టీ వైఎస్సార్ ఆశయ సాధన కోసం ఏర్పడింద ని, టీడీపీ మాత్రం అధికార రాజకీయాల కోసం పుట్టిన పార్టీ అని వ్యాఖ్యానించారు. ప్రజల సం క్షేమం కోసం వైఎస్సార్సీపీ పనిచేస్తే, టీడీపీ పెద్ద ల, దళారుల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని విమర్శించారు.ఉత్తరాంధ్రలో భూదోపిడీ జరుగు తోందని ఆరోపించిన అమర్‌నాథ్, రుషికొండ, భీమిలి, సింహాచలం తదితర ప్రాంతాల్లో కొండ లను తవ్వకాల పేరుతో ధ్వంసం చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు నిర్మించామని, ప్రస్తుతం మా త్రం పర్యాటక ప్రాజెక్టుల పేరుతో ప్రకృతి వనరు లు నాశనం చేస్తున్నారని మండిపడ్డారు.

రాష్ట్ర ప్రజల సమస్యల కంటే అమరావతి రియ ల్ ఎస్టేట్ ప్రయోజనాలకే చంద్రబాబు ప్రాధాన్య త ఇస్తున్నారని, ప్రజల ప్రయోజనాల కంటే వ్యక్తిగత అజెండాలే ముఖ్యమని గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# స్కిల్ గేమ్ పేరుతో గిరిజనులకు మోసం...




- లక్షలాది రూపాయలు దోచుకుంటున్న సూట్ బాల్..
- పోలీస్ శాఖ ఉత్సవ కమిటీ అండదండలతో దోపిడి..
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి
- కూడా సురేష్ కుమార్ (స్కిల్ గేమ్)సూట్ బాల్ నిలుపుదల చేయాలనిడిమాండ్.



**పాడేరు , పెన్ పవర్,మే 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో రాష్ట్ర గిరిజన జాతర మోదకొండమ్మ ఉత్సవాలు మూడు రోజులపాటు అతి వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు దేశ నలుమూలల నుండి అనేకమంది భక్తులు సందర్శకులు తరలివచ్చి జాతర మూడు రోజులు తిలకించి అమ్మవారిని ప్రత్యేక పూజలు చేసుకుంటారు. ఇదే అదునుగా చూసుకుని ప్రతి ఏడాది స్కిల్ గేమ్ పేరిట సూట్ బాల్ జూద గేమ్ బహిరంగంగా వేలాది రూపాయలు కాపు కాసి గేమ్ నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు పోలీస్ శాఖకు ఉత్సవ కమిటీకి ఒప్పందం ఏర్పరచుకొని అధికారికంగా బహిరంగంగా ఈ గేమ్ నిర్వహించడం గమనార్హం...!ఇది స్కిల్ గేమ్ కాదని జూదమని అనేకమంది నిపుణులు మేధావులు చెబుతున్నప్పటికీ మాకు కోర్టు అనుమతి ఉంది పోలీస్ అనుమతులు ఉన్నాయని అమాయక ప్రజలను దోచుకొనే పరిస్థితి నెలకొంది. దీనిని అడ్డుకట్ట వేసే పోలీస్ అధికారులే వత్తాసు పలకడంతో ఇష్ట రాజ్యాంగ ఈ జూదాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. గతంలో పోలీస్ శాఖ ఉన్నత అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఇటువంటి జూదాలను నిషేధించారు. ప్రస్తుత అధికారులు ఉత్సవ కమిటీ ఏకమై ఈ జూద నిర్వహణ దారుల వద్ద లక్షల రూపాయలు ముడుపులు తీసుకుని అమాయక ప్రజలను దోచుకోమని అప్పగించిన చందంగా ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ జూదాల వల్ల ఈ మూడు రోజులపాటు ఉత్సవాలను ఆనందంగా గడపాలని వచ్చిన కుటుంబాలు డబ్బులు పోగొట్టుకొని నిరాశగా తిరిగి వెళ్లే పరిస్థితి నెలకొంది. దీనిపై అవగాహన కలిగి ప్రజలు ఈ జూదానికి దూరంగా ఉండాలని పోలీస్ అధికారులు స్పందించి వెంటనే నిలుపుదల చేయాలని పలువురు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి సూట్ బాల్ మోసపూరిత గేమ్ ను నిలుపుదల చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలు ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని కూడా. సురేష్ కుమార్ హెచ్చరించారు.

## బయో ఇన్పుట్స్ విధానంతో ప్రకృతి వ్యవసాయం సులభం

- బి. ఆర్. సి యజమానుల శిక్షణ తరగతులు



**టెక్కలి, పెన్ పవర్ మే 15 :** కోటబొమ్మాళి మండలం, హరిశ్చంద్రపురం గ్రామం లోని కొత్తమ్మ తల్లి ట్రైనింగ్ సెంటర్‌లో నోడల్ బయో రిసోర్స్ సెంటర్ లో బి.ఆర్.సి యజమానులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డి.పి.ఎం) పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బయో రిసోర్స్ సెంటర్ యజమానులకు సహజ వ్యవసాయంలో ఉపయోగించే బయో ఇన్‌పుట్స్ తయారీ, వినియోగం, వాటి ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించారు. రైతులకు నాణ్యమైన జీవామృతం, బీజామృతం, ఘన జీవామృతం వంటి బయో ఇన్‌పుట్స్ అందించడంలో బి. ఆర్. సిల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు.

ఎ. డి. పి. ఎం ధనుంజయ్ మాట్లాడుతూ నోడల్ బయో రిసోర్స్ సెంటర్ల ఏర్పాటు, నిర్వహణ, రైతులకు అందించాల్సిన సేవలు, సహజ వ్యవసాయ విస్తరణలో వాటి ప్రాధాన్యత గురించి వివరించారు. గ్రామ స్థాయిలో బయో ఇన్‌పుట్స్ అందుబాటులో ఉండటం ద్వారా రైతులు సులభంగా సహజ వ్యవసాయాన్ని ఆచరించగలరని తెలిపారు. సహజ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటం, సాగు ఖర్చులు తగ్గడం, రైతుల ఆదాయం పెరగడం వంటి ప్రయోజనాలను కూడా వివరించారు. బయో ఇన్‌పుట్స్‌ను స్వయంగా తయారు చేసి రైతులకు అందించడం ద్వారా గ్రామీణ స్థాయిలో సహజ వ్యవసాయ విస్తరణకు బి. ఆర్. సి యజమానులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్. పి. ఓ సీఈఓ సత్య ప్రియ , ఎన్. ఎఫ్. ఎఫ్ శ్రావ్య , మృదుల , మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ శోభన్ బాబు , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, బి. ఆర్. సి యజమానులు పాల్గొన్నారు.

## రైతు యాప్ లో సమగ్ర సమాచారం



**టెక్కలి, పెన్ పవర్ మే 15 :** నందిగాం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె. జగన్మోహనరావు శుక్రవారం గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు అందరూ రైతు యాప్ రైతులతో డౌన్లోడ్ చేయించాలని అన్నారు. దీనివల్ల రైతులకు సమగ్ర సమాచారం అందుతుందని తెలిపారు.

అలాగే రైతు గుర్తింపు సంఖ్య, వ్యవసాయ యాంత్రీకరణ లక్ష్యాలను పూర్తి చేయాలని, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి .శ్రీకాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి సైకిల్ వితరణ



**టెక్కలి, పెన్ పవర్ మే 15 :** కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న భవిరి వాణిశ్రీ కి ఆ పాఠశాల పూర్వపు విద్యార్థులు శుక్రవారం సైకిల్ వితరణగా అందజేశారు. వాణిశ్రీ ప్రతిరోజూ సారవకోట మండలం మదనాపురం గ్రామం నుండి పాఠశాలకు కాలినడకతో వస్తుందని గుర్తించి, అమెకు పాఠశాల పూర్వ విద్యార్థులు సైకిల్ కొనుగోలు చేసి ఇచ్చారు. విద్యార్థి వాణిశ్రీకి తండ్రి కొద్దిరోజుల క్రితం మృతి చెందగా, తల్లి వలసకూలీ . అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ పాఠశాలకు వెళ్తూ చదువుకుంటుంది. పేదింటి వాణిశ్రీకి ఈ సహాయం చేయటం పై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సాయం చేయడంలో భాగస్వాములు అయిన కొత్తపల్లి యూత్ కి, ఉపాధ్యాయ బృందానికి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షణ్ముఖరావు తదితరులు ఉన్నారు.

## రాత్రి వేళల్లో ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు



**టెక్కలి, పెన్ పవర్ మే 15 :** ప్రభుత్వ బడులలో పిల్లల నమోదు పెంచే క్రమంలో భాగంగా కోటబొమ్మాళి మండలంలో ప్రభుత్వం ఉపాధ్యాయులు బడి మీది !....బాధ్యత మాది!! అంటూ రాత్రి వేళల్లో ఎన్రోల్మెంట్ చేపడుతున్నారు. అందరూ అందుబాటులో ఉండే చల్లని సాయంత్రం వేళల్లో డ్రైవ్ చేపడుతూ నమోదు పెంచుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా పాఠశాల నిర్వహణ కమిటీ లో కో ఆప్షన్ సభ్యులుగా ఉన్న డా. దుబ్బ సంతోష్ తన విధిని ప్రతిష్టాత్మంగా తీసుకొంటూ నమోదు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఈ డ్రైవ్ లో గురువారం ఒక్కరోజే మదనాపురం, కొత్తపల్లి లో పది మంది వరకు విద్యార్థులు చేరారు. అందులో ఆరుగురు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉండటం గమనార్హం. ప్రతియేటా ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ బడులకు పిల్లలను తీసుకొస్తున్న వీరి కృషికి పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ కార్యక్రమం లో షణ్ముఖ రావు, సునీల్, గోపి గంగూలీ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# బొడ్డమానుపాకల్లో బీసీవై పార్టీ పర్యటన

**పార్టీలో గ్రామస్తుల చేరిక: బీసీవై పార్టీజిల్లా ఇంచార్జ్ కిల్లో రాజన్**



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,మే 15:** గూడెంకొత్తవీధి మండలం బొడ్డమానుపాకలు గ్రామంలో బీసీవై పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ కిల్లో రాజన్ పర్యటించారు. గ్రామస్తుల పిలుపుమేరకు గ్రామానికి చేరుకున్న ఆయన ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భూమి పట్టాలు మంజూరు చేయడం, పెండింగ్‌లో ఉన్న పీఎం జన్‌మన్ బిల్లులను విడుదల చేయడం, మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పార్టీ చేస్తున్న పోరాటం నచ్చి పలువురు గ్రామస్తులు బీసీవై పార్టీలో చేరినట్లు కిల్లో రాజన్ తెలిపారు. పార్టీలో చేరిన వారికి సాదరంగా స్వాగతం పలికినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పాంగి నవీన్, యూత్ అధ్యక్షుడు సాగిన ప్రసాద్, నాయకులు గెమ్మెలి సుందర్రావు, జి. బాలరాజు, సుందర్‌రావు, సన్యాసిరావు, శోభన్‌బాబు, ఆనంద్, చిన్నయ్య, రమేష్, సన్నం నాయుడు, వసంతకుమారి, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పెరిగిన పెట్రోల్ డీజిల్, ధరలపై సిపిఎం ఆందోళన




**నర్సీపట్నం, పెన్ పవర్ (మే 15) :**కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై 3/- పెంచడానికి వ్యతిరేకిస్తూ సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. నర్సీపట్నంలో జిసిసి పెట్రోల్ బంక్ వద్ద ఆటోకి తాడు కట్టి లాగుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ బెంగాల్, కేరళ, తమిళనాడు, అస్సాం, పాండిచ్చేరి ఎన్నికల ఫలితాలు వచ్చిన పది రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం దారుణం అన్నారు. ధరలు పెంచే ఉద్దేశంతోనే ప్రధాని మోడీ ముందుగా పొదుపు పేరుతో ప్రజలకు ఉచిత సలహాలు ఇచ్చారన్నారు. చమురు ధరలు పెంచడం అంటే ప్రజలను మరింత దరిద్రంలోకి నెట్టడమే అన్నారు. ఇప్పటికే ఉచిత బస్ తో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు, ధరలు పెరుగుదల పిడుగుపాటు వంటిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంచార రథంతో జన గణనపై అవగాహన




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 15:**మండల పరిధిలో జన గణన––2027 కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార వాహనం శుక్రవారం పలు గ్రామాల్లో పర్యటించింది. దేవరాపల్లి, లక్కవరపుపేట, రంపుల, చాపరాతి పాలేం మరియు పెదవలస సంత ప్రాంతాల్లో ఈ ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ప్రచార వాహనం ద్వారా జన గణన యొక్క ప్రాముఖ్యత, ప్రతి కుటుంబం సరైన వివరాలు నమోదు చేయాల్సిన అవసరం, ప్రభుత్వ పథకాల అమలులో జనగణన పాత్ర వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. అలాగే జనగణన సమయంలో అధికారులు అడిగే ప్రశ్నలకు సరైన సమాచారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ప్రచార కార్యక్రమానికి మంచి స్పందన తెలియజేశారు. అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జనగణన కార్యక్రమానికి సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

## పార్టీ బలోపేతానికి క్లస్టర్ ఇంచార్జ్‌లు సమర్థంగా పనిచేయాలి



- ప్రతి ఇంటికీ ప్రభుత్వ పనితీరు చేరాలి
- అమరావతిలో టిడిపి శిక్షణ కార్యక్రమంలో కిమిడి నాగార్జున పిలుపు

**అమరావతి పెన్ పవర్ మే 15:**రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ముందుకు సాగుతున్నారని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున పేర్కొన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన క్లస్టర్ ఇంచార్జ్‌ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందన్నారు. పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమల స్థాపన, రోడ్లు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఐటీ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. యువగళం ద్వారా యువతలో నూతన ఆలోచనలను తీసుకొచ్చిన లోకేష్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి క్లస్టర్ ఇంచార్జ్ ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని సూచించారు.

ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే రోజుల్లో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కిల్ గేమ్ పేరుతో గిరిజనులకు మోసం...

- లక్షలాది రూపాయలు దోచుకుంటున్న సూట్ బాల్..
- పోలీస్ శాఖ ఉత్సవ కమిటీ అండదండలతో దోపిడి..
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి
- కూడా సురేష్ కుమార్ (స్కిల్ గేమ్)సూట్ బాల్ నిలుపుదల చేయాలనిడిమాండ్.

**పాడేరు , పెన్ పవర్,మే 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో రాష్ట్ర గిరిజన జాతర మోదకొండమ్మ ఉత్సవాలు మూడు రోజులపాటు అతి వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు దేశ నలుమూలల నుండి అనేకమంది భక్తులు సందర్శకులు తరలివచ్చి జాతర మూడు రోజులు తిలకించి అమ్మవారిని ప్రత్యేక పూజలు చేసుకుంటారు. ఇదే అదునుగా చూసుకుని ప్రతి ఏడాది స్కిల్ గేమ్ పేరిట సూట్ బాల్ జూద గేమ్ బహిరంగంగా వేలాది రూపాయలు కాపు కాసి గేమ్ నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు పోలీస్ శాఖకు ఉత్సవ కమిటీకి ఒప్పందం ఏర్పరచుకొని అధికారికంగా బహిరంగంగా ఈ గేమ్ నిర్వహించడం గమనార్హం...!ఇది స్కిల్ గేమ్ కాదని జూదమని అనేకమంది నిపుణులు మేధావులు చెబుతున్నప్పటికీ మాకు కోర్టు అనుమతి ఉంది పోలీస్ అనుమతులు ఉన్నాయని అమాయక ప్రజలను దోచుకొనే పరిస్థితి నెలకొంది. దీనిని అడ్డుకట్ట వేసే పోలీస్ అధికారులే వత్తాసు పలకడంతో ఇష్ట రాజ్యాంగ ఈ జూదాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. గతంలో పోలీస్ శాఖ ఉన్నత అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఇటువంటి జూదాలను నిషేధించారు. ప్రస్తుత అధికారులు ఉత్సవ కమిటీ ఏకమై ఈ జూద నిర్వహణ దారుల వద్ద లక్షల రూపాయలు ముడుపులు తీసుకుని అమాయక ప్రజలను దోచుకోమని అప్పగించిన చందంగా ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ జూదాల వల్ల ఈ మూడు రోజులపాటు ఉత్సవాలను ఆనందంగా గడపాలని వచ్చిన కుటుంబాలు డబ్బులు పోగొట్టుకొని నిరాశగా తిరిగి వెళ్లే పరిస్థితి నెలకొంది. దీనిపై అవగాహన కలిగి ప్రజలు ఈ జూదానికి దూరంగా ఉండాలని పోలీస్ అధికారులు స్పందించి వెంటనే నిలుపుదల చేయాలని పలువురు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి సూట్ బాల్ మోసపూరిత గేమ్ ను నిలుపుదల చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలు ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని కూడా. సురేష్ కుమార్ హెచ్చరించారు.

## 25 కేజీల గంజాయి పట్టివేత



**నర్సీపట్నం, పెన్ పవర్ (మే 15) :** 25 కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు ముద్దాయిలను నర్సీపట్నం రూరల్ పోలీసులు శుక్రవారం ఉదయం నెల్లిమెట్ట జంక్షన్ వద్ద పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు డిఎస్పి పి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్సై రాజారావు తమ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో గంజాయితో ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు చెందిన చల్లా గోపి, ఒడిస్సా కు చెందిన మహదేవ్ ఖిలా అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్దనుండి 25 కేజీల గంజాయి, రెండు సెల్ ఫోన్లు, వెయ్యి రూపాయల నగదు సీజ్ చేశారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు 12. 70 లక్షలు ఉంటుందని సిఐ రేవతమ్మ తెలిపారు. ఈ కేసులో చొరవ చూపిన సీఐ రేవతమ్మ, ఎస్సై రాజారావు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు.

## బెట్టు కాటలపై దాడులు

- బెట్టు కాటలను సీజ్ చేసిన జిల్లా తూనికల అధికారిని అనురాధ.



**డుంబ్రిగూడ:- పెన్ పవర్,మే 15:**మండలంలోని శుక్రవారం జరిగిన అరకు వారపు సంతలో జిల్లా కొలతలు తూనికల శాఖ అధికారులు బెట్టుకాటలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బెట్టుకాటలతో గిరిజనులను మోసం చేస్తున్న కాటాలను సీజ్ చేసి వ్యాపారులపై కేసులు నమోదు చేశారు.బెట్టు కాటలతో అమాయక గిరిజనులను మోసం చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పదని జిల్లా అధికారిణి అనురాధ హెచ్చరించారు.

## పాదరక్షలు పంపిణీ..




**చీపురుపల్లి పెన్ పవర్ మే 15 :** ప్రతి సంవత్సరం ఎండాకాలంలో చలివేంద్రాలతో పాటు పాదరక్షలు అందించు కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం కూడా మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు ఆధ్వర్యంలో శుక్రవారం నాడు చీపురుపల్లి సంత మార్కెట్ పరిసరాల్లో మండుటెండలో పాదరక్షలు లేకుండా నడుస్తున్న వారిని గుర్తించి 36 మందికి గోవిందరాజులు ఆర్థిక సహకారంతో ఉచితంగా అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ పల్లా వెంకయ్య, గుడివాడ రామ్మూర్తి నాయుడు, పాంద్రంకి వాసు, డి ఆర్ ప్రసాద్ రావు, మీసాల కృష్ణమూర్తి, రెడ్ క్రాస్ టెక్నీషియన్ రమణ, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు...

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి



**సాలూరు పెన్ పవర్. సీజన్ మే 15.** వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సాలూరు మున్సిపల్ ప్రత్యేక అధికారి మరియు జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం సాలూరు మున్సిపాలిటీ రామా కాలనీ బంగారమ్మ కాలనీ పర్యటించి సీజన్లో వ్యాధులపై కాలువల్లో లార్వా ద్రావణాన్ని పిసికారి చేయాలని వార్డులను స్వయంగా పరిశీలించారు కాలువల్లో చెత్తను తొలగించి శుభ్రం పరచాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ సిబ్బంది ప్రతి శుక్రవారం ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు వార్డుల్లో పర్యటించి ఏఎన్ఎంలు కలిసి పరిసరాలు పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన చేయాలని ప్రతి ఒక్కరు తమ పరిసర ప్రాంతాల్లో సుబ్రముగా ఉంచుకోవాలని అన్నారు తడి చెత్తను పొడి చేత్తను వేరుచేసి ఆశించి కార్మికులకు అందజేయాలని సూచించారు సీజనల్ వ్యాధులు ప్రబల కొండ అన్ని జాగ్రత్తలు తీసుకుని కొలువుల్లో లార్వా ద్రావణాన్ని పిచికారి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ టి రత్నకుమారు. సాలిటీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ మున్సిపల్ సిబ్బంది సచివాలయ ఏ ఎన్ ఎం లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మోదకొండమ్మ తల్లి జాతర సందర్భంగా మెగా రక్తదాన శిబిరం



**పాడేరు, పెన్ పవర్, మే 15:**మోదకొండమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో భారీగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ ఐఏఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.

మోదకొండమ్మ వారి జాతర సందర్భంగా ఈ నెల 17, 18 మరియు 19వ తేదీలలో అమ్మవారి జాతర జరగనున్నందున, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అల్లూరి సీతారామరాజు జిల్లా వారు "రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి" అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ మూడు రోజులు నిర్వహించే మెగా శిబిరంలో జిల్లాలోని రెవెన్యూ, సచివాలయ, పోలీస్ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, పండుగలో పాల్గొనే యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జాతర సందర్భంగా వచ్చే భక్తులు, స్థానికులు మానవతా దృక్పథంతో రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, జిల్లా రెడ్ క్రాస్ యంత్రాంగంతో మమేకమవ్వాలని, మీతో పాటు పదిమంది యువతీ యువకులను రక్తదానం చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు.

రెడ్ క్రాస్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లాలో ప్రతి ఒక్క జిల్లా అధికారి, వారి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రెడ్ క్రాస్ 'లైఫ్ మెంబర్‌షిప్' డ్రైవ్‌లో పాల్గొని సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సెక్రెటరీ జి. గౌరీ శంకరరావు, కోశాధికారి పి. సూర్యారావు, రెడ్ క్రాస్ సిబ్బంది, జిల్లా కోఆర్డినేటర్ ఎస్. పూర్ణానంద, ఎంసీ మెంబర్లు, ఇతర రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తలసేమియాతో బాధపడుతున్న బాలుడికి సాయం చేయాలి

మాజీ ఉపసర్పంచ్ సోమేశ్ కుమార్ విజ్ఞప్తి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 14:**మండలంలోని రింతాడ పంచాయతీ బొడ్డుమాను వీధికి చెందిన పాంగి రమణ--రూత్ దంపతుల సంవత్సరం ఏడు నెలల బాలుడు జస్వంత్ పుట్టుకతోనే తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. విశాఖపట్నం కేజీహెచ్ ఆసుపత్రి వైద్యులు బాలుడికి తలసేమియా మేజర్‌గా నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలుడు ప్రాణాలతో ఉండాలంటే ప్రతి 15 రోజులకు లేదా నెలకోసారి రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.బాలుడికి ఎన్టీఆర్ భరోసా మెడికల్ పెన్షన్ మంజూరు చేయాలని కుటుంబ సభ్యులు సచివాలయం, వైద్య అధికారులను పలుమార్లు సంప్రదించినప్పటికీ ఇప్పటివరకు స్పందన లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో పాటు బాలుడి సంరక్షణ బాధ్యతలతో తల్లి ఇంటికే పరిమితమవ్వడంతో తండ్రి ఒక్కరే కుటుంబాన్ని పోషిస్తూ వైద్య ఖర్చులు భరించడం కష్టంగా మారిందన్నారు.ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఉపసర్పంచ్ సోమేశ్ కుమార్ గ్రామాన్ని సందర్శించి బాలుడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, వైద్య అధికారులు వెంటనే స్పందించి బాలుడికి ఎన్టీఆర్ భరోసా మెడికల్ పెన్షన్ మంజూరు చేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

# జిల్లాలోని 69 స్వయం సహాయక సంఘాలకు రూ.10.35 లక్షల రివాల్వింగ్ ఫండ్ విడుదల



**పాడేరు, పెన్ పవర్, మే 15:**జిల్లాలోని మహిళా సాధికారతను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. జిల్లాలోని 11 మండలాలకు చెందిన 69 స్వయం సహాయక సంఘాలకు (గా౦+౦) ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల 35 వేలు రివాల్వింగ్ ఫండ్ చెక్కును జిల్లా కలెక్టర్ నిశాంతి.టి గురువారం విడుదల చేశారు.

శుక్రవారం ఉదయం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లాలోని 11 మండలాలకు చెందిన 69 స్వయం సహాయక సంఘాలకు మొత్తం రూ.10.35 లక్షల రివాల్వింగ్ ఫండ్ చెక్కును యూనియన్ బ్యాంకు ద్వారా లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ అందజేశారు.

11 మండలాల పరిధిలోని 69 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి ఒక్కో గ్రూపులోని ప్రతి సభ్యురాలికి రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందుతుందని ఆమె పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈ రివాల్వింగ్ ఫండ్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. మహిళా సంఘాలు ఈ నిధులను సద్వినియోగం చేసుకుని, చిన్నపాటి వ్యాపారాలు లేదా స్వయం ఉపాధి మార్గాల ద్వారా తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు.

గ్రామీణ గిరిజన ప్రాంతాల్లోని మహిళా సంఘాల బలోపేతానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్డీఏ వి. మురళి, మండల సమైక్య అధ్యక్షురాలు కే. నిర్మల, కే. ఈశ్వర్ కుమారి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నార.

# పీవీటీజీల సామాజిక, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కుటుంబ సర్వేకు సహకరించండి

ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ

**పాడేరు, పెన్ పవర్, మే 15:**కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో భాగంగా పీవీటీజీ కుటుంబాల సమాచారం కోసం నిర్వహిస్తున్న సర్వేకు మండల అభివృద్ధి అధికారులు ముఖ్య భూమిక తీసుకుని ఈ సర్వేను శతశాతం పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ ఆదేశించారు.

భారతదేశంలోని గిరిజన జాతులలో అత్యంత అట్టడుగున ఉన్న వర్గాలైన పీవీటీజీ కుటుంబాల సామాజిక-ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడానికి భారతదేశ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాలు దీర్ఘకాలికంగా అభివృద్ధిలో ఉన్న అంతరాలను తగ్గించడానికి మరియు దేశవ్యాప్తంగా ప్రతి పీవీటీజీ కుటుంబానికి అవసరమైన సేవలు అందేలా చూడటమే లక్ష్యంగా పెట్టుకున్నాయి.

సమగ్ర అభివృద్ధి ఫలితాలను సాధించడానికి, పీవీటీజీ కుటుంబాలకు అవసరమైన పథకాలు, ప్రయోజనాలు అందించడానికి వారికి అందించే పథకాలు సమర్థవంతంగా అమలు చేసేందుకు కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వారి అభివృద్ధి లక్ష్యంతో పనిచేస్తున్నాయి.

అందుకు గాను, పీవీటీజీ కుటుంబాలను గుర్తించి, ధ్రువీకరించబడిన కుటుంబాల వివరాలు, వారి స్థాయి సమాచారాన్ని రూపొందించడానికి కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ "సర్వే సేతు" అనే మొబైల్ సర్వే అప్లికేషన్ ద్వారా ప్రతి పీవీటీజీ కుటుంబ సమాచారాన్ని సేకరిస్తోంది.

ఈ సమాచార సేకరణలో భాగంగా ప్రభుత్వం ద్వారా నియమించిన సర్వేయర్లు ప్రతి కుటుంబాన్ని సందర్శించి సర్వే చేయడం జరుగుతుంది. ఈ సర్వేలో భాగంగా మీ ఇంటికి వచ్చిన సర్వేయర్లకు మీ కుటుంబ సభ్యుల వివరాలను అందించి నమోదు చేయించుకోవాలని, ఇందులో భాగంగా మీ వద్ద ఉన్న ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు



ఖాతా వివరాలు, భూమి పట్టాలు, కుల ధ్రువీకరణ పత్రాలను వారికి చూపించి సరైన సమాచారాన్ని అందించాలని తెలిపారు.

ఈ సర్వే ద్వారా పీవీటీజీ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి నేరుగా వారి బ్యాంకు ఖాతాలో నగదు చెల్లింపు జరుగుతుందని, అలాగే గ్రామ స్థాయిలో ప్రభుత్వ సిబ్బందైన పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు వారి పరిధిలో ఉన్న అన్ని పీవీటీజీ కుటుంబాల వద్దకు సర్వేయర్లతో కలిసి సర్వే పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా చల్లంగి జ్ఞానేశ్వరి నియామకంపై హర్షం

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్ మే 15:**ప్రముఖ పుణ్య క్షేత్రం సింహాచలం నరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా చల్లంగి జ్ఞానేశ్వరి ని నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని టీఎన్ఎస్ఎఫ్ జికే వీధి మండల అధ్యక్షుడు గుంట బుజ్జిబాబు, కార్యదర్శి ముక్కలి ఐశ్వర్య హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లా చింతపల్లి మండలానికి చెందిన చల్లంగి జ్ఞానేశ్వరి గత ఇరవై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో కీలకంగా పనిచేస్తున్నారన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. ఆమె వివిధ హోదాల్లో పనిచేసి అందరి మన్ననలు అందుకున్నారన్నారు. తాజాగా ఆమె చేసిన సేవలు గుర్తించిన ప్రభుత్వం సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా నియమించడం అభినందనీయమన్నారు.





## లబ్ధిదారుల ఇంటికే చేరిన సీఎం రిలీఫ్

61వ వార్డులో సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ గణబాబు



**ములగాడ, పెన్ పవర్,మే 15 :**విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గంలోని 61వ వార్డులో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ పర్యటించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి స్వయంగా అందజేశారు. అనారో గ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలు భారంగా మారకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తున్నామని గణబాబు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసు కుంటున్నామని హామీ ఇచ్చారు.ఈ సందర్భం గా 61వ వార్డుకు చెందిన పలువురు లబ్ధిదా రులకు లక్షలాది రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు.మాజ్జి అచ్యుతరా వుకు రూ.1,12,952- పెద్దాడ గాయత్రికి రూ.48,289-ఇండిగ లక్ష్మికి రూ.81,000/-

కష్టకాలంలో ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహా యం అందించడంపై లబ్ధిదారులు, వారి కుటుం బ సభ్యులు ఎమ్మెల్యే గణబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నో వెహికల్ డేకు గణబాబు మద్దతు

అధికార వాహనానికి బదులు బ్యాటరీ వాహనంపై పర్యటన



**ములగాడ, పెన్ పవర్, మే 15 :**ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా విశాఖ పశ్చిమ నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదర్శవంతమైన ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపు, సీఎం అధ్యక్షతన రాష్ట్ర క్యా బినెట్ ఆమోదించిన 'నాదేశం - నా బాధ్యత' తీర్మానాల స్ఫూర్తితో ఆయన శుక్రవారం ప్రత్యే కంగా బ్యాటరీ వాహనంపై నియోజకవర్గంలో పర్యటించారు.ప్రభుత్వం కేటాయించిన అధికా రిక ప్రోటోకాల్ వాహనాన్ని వినియోగించకుండా, సాధారణ ఎలక్ట్రిక్ వాహనంలో ప్రజల మధ్యకు వెళ్లిన గణబాబు పర్యావరణ హిత రవాణాపై అవగాహన కల్పించారు. క్యాబినెట్ నిర్ణయిం చిన 'నో వెహికల్ డే' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన ఉద్దేశమని ఆయన తెలిపా రు.ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, డిప్యూటీ సీఎం సూచించినట్లుగా వారానికి ఒకరోజు 'నో వెహికల్ డే' పాటించే అలవాటు పెంపొందించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చా రు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు మద్దతు లభిస్తుందని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ఈవీ వాహనాలు, సోలార్ ఎనర్జీ వినియోగం పెరగాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ విప్ హోదాలో ఉండి కూ డా కాన్వాయ్ హంగులను పక్కన పెట్టి సాధా రణ బ్యాటరీ వాహనంలో పర్యటించిన గణబా బు చర్యను స్థానికులు, పర్యావరణ ప్రేమికులు అభినందించారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

- కృష్ణాపురంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు




**పద్మనాభం, పెన్ పవర్, మే 15 :**పద్మనాభం మండలం పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో ప్రభుత్వ భూములపై ఎలాంటి ఆక్ర మణలు జరగకుండా రెవెన్యూ శాఖ అధికా రులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూమిని రక్షించే ఉద్దేశంతో సంబంధిత స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి. శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించగా, వీఆర్వో వీర్రాజు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు కూడా సహకరించాలని రెవెన్యూ అధికారులు సూచించారు.

# డిజైర్ సొసైటీకి ప్రవాస భారతీయుడి వితరణ




**గాజువాక: పెన్ పవర్,మే15:**ఎయిడ్స్ బాధిత పిల్లలను అక్కున చేర్చుకొని సేవలశీదిస్తోన్న గాజువాక సమీపం,అఫీషియల్ కోలనీ లోని డిజైర్ సొసైటీకి ప్రవాస భారతీయుడు చేయూతనందించారు. తుంగలాం ప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐ గొందేశి సుధీర్ రెడ్డి తన తండ్రి రామిరెడ్డి జ్ఞాపకార్థం 65 వేల విలువైన నిత్యావసర వస్తువులను శుక్రవారం అందజేశారు. ముఖ్య అతిథిగా సౌత్ సర్కిల్ క్రైమ్ సిఐ కె. శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ డిజైర్ సొసైటీ ద్వారా విద్యను పొందుతున్న ఎయిడ్స్ బాధిత చిన్నారులకు అండగా నిలిచిన ఎన్ఆర్ఐ ను అభినందించారు. ఎదుటి వారికి సాయం చేయాలన్న గొప్ప మనసు అందరిలో ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి దిశగా ముందుకు వెళుతుందని అన్నారు. తండ్రి ఆశయాలను పాటిస్తూ సమాజ అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తున్న సుధీర్ రెడ్డిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని తోచిన సాయం చేయాలని కోరారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతినెల ఒక్కో ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని తన తండ్రి పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజైర్ సొసైటీ ఇంచార్జి లక్ష్మణ్,రజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలను దొంగలిస్తున్న వ్యక్తి అరెస్ట్.....

- రెండు వాహనాలు స్వాధీనం...
- నాతవరం పోలీస్ మైత్రి యువతకు ప్రత్యేక ధన్యవాదాలు...
- ఎస్పై వై.తారకేశ్వరరావు.....



**నాతవరం,పెన్ పవర్ (మే15):** కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ఏర్పర్చిన మైత్రి పోలీస్ నుంచి వచ్చిన నమ్మకమైన సమాచారం మేరకు దొంగిలించబడిన పల్సర్ ఎన్ఎస్ 160 మోటార్ సైకిల్ ను తీసుకెళుతున్న కాకినాడ జిల్లా,కోటనందూరు మండలం,అల్లిపూడి గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ ను శుక్రవారం వల్లంపేట జంక్షన్ వద్ద పట్టుకోవడం జరిగిందని ఎస్సై వై. తాకేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిందితుడు వద్ద నుండి దొంగలించబడిన రెండు వాహనాలైన ఒక మోటార్ సైకిల్, ఒక స్కూటీ స్వాధీనం చేసుకుని నిందితుడును అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం నర్సీపట్నం కోర్టుకు హాజరపరచడం జరిగిందని తెలిపారు. ప్రాదమిక విచారణ లో భాగంగా నిందితుడు గ్రామ శివారుల్లో రాత్రి వేళల్లో రోడ్లపై పార్కు చేసిన బైకులను ఎంపిక చేసుకొని హ్యాండ్ లాక్స్ విరగొట్టి వాహనాల దొంగిలించి వాటిని విక్రయించి గా వచ్చిన డబ్బులతో జల్సాలకు అలవాటు పడి ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని అన్నారు. ఇటీవల తాండవ సెంటర్ వద్ద దొంగలించబడిన బైక్ కేసులో సీసీ కెమెరాల ఫుటేజ్ ను నాతవరం పోలీసులు విశ్లేషించి అనుమానితుడు వివరాలను నాతవరం పోలీస్ మేస్త్రి గ్రూపులో షేర్ చేయగా స్పందించిన మైత్రి యువత వెంటనే పోలీసులకు కీలక సమాచారం అందించడం వల్ల నిందితులను పట్టుకోవడం సాధ్యమైందని తెలిపారు. సహకరించిన పోలీస్ మైత్రి యువతకు నాతవరం పోలీసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ప్రజలు సహకారం ఉంటే ప్రతి గ్రామాల్లో కూడా కూడళ్ల వద్ద అందరు సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోగలిగితే నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరిగే అపరిచిత వ్యక్తులు కనిపించిన లేదా ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు చేసిన గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని, ముఖ్యంగా యువత సమాజంలో భాగస్వాములై పోలీసులకు సమాచారం అందిస్తే నేర నియంత్రణలో కీలకపాత్ర పోషించగలరని ఆయన పేర్కొన్నారు.

# పీజీఆర్ఎస్ పూర్తయ్యేంతవరకు అధికారులందరూ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి :

- జిల్లా కలెక్టర్ నిశాంతి
- నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు



**పాడేరు, పెన్ పవర్, మే 15:**సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కు 62 వినతులు, రెవెన్యూ క్లినిక్‌కు 41 వినతులు వచ్చాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంతి.టి, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ, డీఆర్వో (ఎఫ్ఏసీ) ఎం.వి.ఎస్. లోకేశ్వరరావుతో కలిసి సంయుక్తంగా వివిధ మండలాలు, గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల వినతులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్జీదారుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ఫిర్యాదులను ఎంత గడువులోగా పరిష్కరిస్తారో ఫిర్యాదుదారునికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అర్జీదారులకు తెలిపారు.

జిల్లాలో ప్రతి శుక్రవారం జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా అధికారులందరూ ఆయా శాఖ పరమైన సమగ్ర సమాచారంతో హాజరుకావాలని, పీజీఆర్ఎస్ అయ్యేంతవరకు అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన యెడల వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పీజీఆర్ఎస్‌లో అధికారి మాత్రమే ఉండాలని, అర్జీదారుని అప్లికేషన్ తీసుకుని సమస్యను నమోదు చేసే కౌంటర్ వద్ద కింది స్థాయి శాఖ అధికారులు ఉండాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించాలని, ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, అలా లేని ఎడల వారిపై తగు శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో ప్రతిరోజు ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు.

మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల స్థాయిలోనే పరిశీలించినట్లయితే, జిల్లా స్థాయిలో తక్కువ మంది ప్రజా ఫిర్యాదులు చేసేందుకు వస్తారని, అలాగే ఫిర్యాదులు తగ్గుతాయని, తద్వారా అర్జీదారుని సమస్య వెంటనే పరిష్కరించగలరని తెలిపారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించినట్లయితే ఐవీఆర్ఎస్ ప్రగతిలో ఉంటుందని, ఆ దిశగా ప్రతి ఒక్క జిల్లా అధికారి అర్జీదారుని సమస్యపై పూర్తి అవగాహన తెచ్చుకుని వివరాలు ఇవ్వాలన్నారు. మండల తహసీల్దార్, ఎంపీడీవో, మండలానికి సంబంధించిన అధికారులు, సిబ్బంది సమస్యలపై వివరాలు తెలుసుకొని ఉండాలన్నారు.

గ్రీవెన్స్‌లో ఇచ్చే అర్జీలు పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖకు పంపే విధంగా చూడాలన్నారు.

అర్జీదారులు 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని, అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి హ్ట్ట్ప్స్://వీవవఎశీయిఎ.ఖజా.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుంటుందని, ప్రజల ఫిర్యాదులు పరిష్కరించి వారి సంతృప్తి స్థాయిలు పెంచాలని, ఈ ప్రక్రియలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఏ స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయో ఆ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో ఉన్న ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, సమస్య ఎందుకు పరిష్కారం కాదో బాధ్యతగా ఫిర్యాదుదారునికి వివరించాలన్నారు. ప్రత్యేకంగా భూ సంబంధిత సమస్యలపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించేటప్పుడు ఖచ్చితంగా ఫిర్యాదుదారుని భూ రికార్డులను తనిఖీ చేయాలని, ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో క్రోడీకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించుటలో కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు.

ఈ రోజు స్వీకరించిన ఫిర్యాదులు డీఆర్డీఏ, ఐసీడీఎస్, బ్యాంకు, రెవెన్యూ, విద్యుత్, పౌర సరఫరాలు, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్, పంచాయతీ రాజ్, పీఆర్ ఇంజనీరింగ్, ఎస్ఎంఐ, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ఓఎఫ్ఆర్, పెన్షన్, రోడ్లు భవనాలు, వైద్య శాఖలకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. మండలాల్లోని వివిధ గ్రామాల్లో రహదారులు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని అర్జీదారులు అర్జీలు సమర్పించారు.

పీజీఆర్ఎస్ కార్యక్రమం అనంతరం ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును సందర్శించి పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న అర్జీదారులు ఈ క్యాంపులో పాల్గొన్నారా, ఎంతమంది పాల్గొన్నారు, వారందరికీ సరిపడే మందులు అందించారా అని సంబంధిత డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్డీఏ వి.మురళి, పీడీ డ్వామా డి.విద్యాసాగర్, జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణారావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీబీకే పరిమళ, పీడీ ఐసీడీఎస్ ఝూన్సీ బాయ్ పడల్, గురుకులం ఓఎస్డీ మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్, ఐటీడీఏ పరిపాలన అధికారి హేమలత, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె. వెంకట రావు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ సోము నాయుడు, డీపీఓ చంద్రశేఖర్ రావు, డీఎల్పీఓ పి.ఎస్. కుమార్, జిల్లా మలేరియా అధికారి, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాడేరు, జి.మాడుగుల, అనంతగిరి, హుకుంపేట, అరకు తహసీల్దార్లు తదితరులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల మధ్య ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జన్మదిన వేడుకలు



**కొత్తపేట, పెన్ పవర్, మే15:**కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు 62వ జన్మదిన వేడుకలను కొత్తపేట మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పది గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. బస్టాండ్ సెంటర్ వద్ద కేక్ కటింగ్ నిర్వహించి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలు, రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయడంతో పాటు చంటి పిల్లలకు ఉయ్యాలలు, ఆక్సిజన్ సిలిండర్ అందజేశారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని అన్న క్యాంటీన్‌లో ఉచిత అల్పాహారం, భోజనం వితరణ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాసేవలో నిరంతరం ముందుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు.

# ఆర్వీనగర్ పాలగెడ్డ రహదారి కి ఎట్టకేలకు మోక్షం

-: రూ. 18 కోట్లతో చురుగ్గా సాగుతున్న నిర్మాణం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 15:**ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకొని ఆర్వీ నగర్ పాలగెడ్డ రహదారి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.18 కోట్ల వ్యయంతో ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. ఆర్వీనగర్ పాలగెడ్డ వరకు రహదారి గత పదిహేనేళ్లుగా మరమ్మతులకు నోచుకోక గోతులమయంగా మారింది. గత ఏడాది కురిసిన వర్షాలకు ఈ రోడ్డు రూపు రేఖలు మారిపోయాయి. రోడ్డు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణానికి రూ. 18 కోట్లు మంజూరు చేసింది. నిధులు మంజూరైన నిర్మాణ పనుల ప్రారంభానికి ఏడాదిన్నర పట్టింది. ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం లంకపాకలు గూడెం కొత్తవీధి మధ్య నిర్మాణం పనులు జరుగుతున్నాయి. జీకేవీధి లో శుక్రవారం జరుగుతున్న నిర్మాణాన్ని ఆర్ అండ్ బి చింతపల్లి ఏఈఈ జయరాజ్ పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంతో ఈ ప్రాంతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆరిలోవ రోడ్లకు విద్యుత్ వెలుగులు




పెన్ పవర్ 24 NEWS
పెన్ పవర్
తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు
PEN POWER DIGITAL
For the truths that never sleep

నిర్వహించారు. ఈ సందర్భంగా మరిడియ్య మాట్లాడుతూ స్వస్థ నారీ స్వశక్తి సేవా పరివార ... తదితరులు పాల్గొన్నారు.

## అంధకారంలో ఆరిలోవ రోడ్లు

- విద్యుత్ స్తంభాలు వేశారు
- విద్యుత్ దీపాలు మరిచారు
- చీకటి పడితే మందుబాబుల చిందులు పగిలిన సీసాలు
- ఆ దారి"బారు"దారి

స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం సెప్టెంబర్ 27: జీవీఎంసీ జోన్ 2 పరిధి 13 వ వార్డు వార్డ్ ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ నుండి శివాజీ నగర్ బ్రహ్మంగారి గుడి కి వెళ్లే ప్రధాన రహదారి విద్యుత్ దీపాలు లేక అంధకారంలో ఉన్న రోడ్లపై రాకపోకలు సాగించే వారికి ఇబ్బందికరంగా ఉంది. విశాలమైన రోడ్లు ఉన్నప్పటికీ మందుబాబులకు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. చీకటి పడితే రోడ్లపై చిందులు వేసే మందుబాబులు తాగిన మైకంలో ఖాళీ సీసాలను కూడా రోడ్లపై పగలగొట్టి ఆ దారిని వెళ్లే వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



**స్విచ్ ఆన్ చేసిన ఎమ్మెల్యే వెలగపూడి**

**విశాఖ తూర్పు,పెన్ పవర్,మే 15:** తూర్పు నియోజకవర్గం 13 వ వార్డు అభివృద్ధి పనులలో భాగంగా స్మార్ట్ సిటీ జీవీఎంసీ నిధులు 32 లక్షల రూపాయలతో పాత స్కిన్ డెవలప్మెంట్ నుండి ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వరకు విద్యుత్ దీపాల వెలుగులను స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణ బాబు స్విచ్ ఆన్ చేశారు. అంధకారములో ఆరిలోవ రోడ్లు, స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను పెన్ పవర్ దినపత్రికలో ప్రచురించడం జరిగింది. వార్డు అభివృద్ధి పనులలో భాగంగా జీవీఎంసీ కౌన్సిలింగ్ నిధులు మంజూరైనప్పటికీ పనులు జాప్యం జరిగింది. ఎట్టకేలకు పనులు ప్రారంభించి విద్యుత్ వెలుగులు ప్రజలకు అందించినందుకు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో జీవీఎంసీ ఎలక్ట్రికల్ వర్క్స్ డిఈ ఎం.అన్నంనాయుడు, ఏఈ రాజేష్,ఇన్స్పెక్టర్ వేణు, వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, సీనియర్ నాయకులు కెల్లా సత్యనారాయణ,విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు,వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, యల్లమిల్లి సురేష్, శ్రీనివాస్, వడిశెల శ్రీను,కర్రి మణి, ఖాదర్ భాష,రుత్తల వెంకట్రావు,పి ఐ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

# నీటి కోసం పోరాడిన గ్రామానికి ఊపిరి పోసిన అప్ హోల్డ్

**బోర్‌వెల్‌తో కొత్త జీవితం.**

**కిలోమీటర్ల దూరం నడిచిన బాధకు ముగింపు -- ప్రతి ఇంటికి తాగునీరు**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 15.**నీటి కోసం ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, ఒక్క చుక్క తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితుల్లో ఉన్న గ్రామానికి అప్ హోల్డ్ ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ ఆశాకిరణంగా నిలిచింది. గ్రామ ప్రజల దీర్ఘకాలిక నీటి సమస్యను గుర్తించిన అప్ హోల్డ్ ఎన్జీవో తక్షణ చర్యలు తీసుకుని విజయవంతంగా బోర్‌వెల్ తవ్వించి, నీటి సౌకర్యాన్ని అందించింది. మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ, బిరిగూడ గ్రామంలో ఇప్పటివరకు మహిళలు మరియు చిన్నారులు నీటి కోసం రోజంతా కష్టపడుతూ, తమ సమయాన్ని కోల్పోయేవారు. విద్య, ఉపాధి వంటి ముఖ్యమైన అవకాశాలు కూడా నీటి కొరత వల్ల దూరమయ్యాయి. అదేవిధంగా, సరిపడిన నీటి లభ్యత లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు కూడా పెరిగాయి. ఇటువంటి పరిస్థితుల్లో అప్ హోల్డ్ ఎన్జీవో చేపట్టిన ఈ బోర్‌వెల్ ప్రాజెక్ట్ ద్వారా ఇప్పుడు గ్రామంలో నీటి సమస్య పరిష్కారమైందని లక్ష్మీపురం మాజీ సర్పంచ్ కొర్ర త్రినాథ్ అన్నారు. ప్రతి ఇంటికి నీరు అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజల జీవితాల్లో ఒక కొత్త మార్పు ప్రారంభమైందని, మహిళలకు సమయం ఆదా కావడంతో వారు కుటుంబంపై మరింత శ్రద్ధ పెట్టగలుగుతన్నారు. అప్ హోల్డ్ ఎన్జీవో చైర్మన్ ఫిలిప్ తిమోతి మాటల్లో “నీరు అనేది ప్రతి మనిషికి ప్రాథమిక హక్కుఅని, ఈ ప్రాజెక్ట్ ద్వారా ఒక గ్రామం మాత్రమే కాదు, వారి భవిష్యత్తుకూ ఆశను అందించ గలుగుతున్నామన్నారు. అప్ హోల్డ్ ఎన్జీవో ఎప్పటికీ సమాజంలోని అట్టడుగు వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మంత్రి నారా లోకేష్ పర్యటన ప్రాంతాలను, ఏర్పాట్లను పరిశీలించిన నేతలు, అధికారులు









**, గండేపల్లి, పెన్ పవర్, మే 15** రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఈనెల 18, 19 తేదీల్లో జగ్గంపేట నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ఈరోజు సంబంధిత నేతలు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

లోకేష్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవితేజతో కలిసి స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ తిలక్, ఇరిగేషన్ ఈఈ రాజేశ్వరావు, సీఏ తిరుపతిరావు తదితరులు పర్యటన జరిగే ప్రాంతాలను సందర్శించారు.

పరిశీలించిన ప్రాంతాలు:

1. రాత్రి బస ప్రదేశం: లోకేష్ రాత్రి బస చేసే పరిణయం ఫంక్షన్ హాల్‌ను పరిశీలించి భద్రత, సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు.
2. రైతులతో ముఖాముఖి రైతులతో సమావేశం నిర్వహించే పామాయిల్ తోటను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు.
3. తాళ్లూరు లిఫ్ట్ శంకుస్థాపన స్థలం: రూ. 52 కోట్లతో నిర్మించనున్న తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ శంకుస్థాపన చేయనున్న ప్రదేశానికి వెళ్లి జరుగుతున్న పనులు, పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అదే ప్రాంతంలో నిర్వహించే బహిరంగ సభకు అనువైన స్థలాన్ని కూడా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, “మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేసేందుకు పోలీస్ శాఖ, లోకేష్ ప్రోగ్రాం కమిటీ సభ్యులతో కలిసి ప్రతి ఏర్పాటును క్షుణ్ణంగా పరిశీలించాం. రైతుల సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధికి ఈ పర్యటన దోహదపడుతుంది” అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాంద్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర, వేములకొండ జోగారావు, పిల మహేష్, దాపర్తి సీతారామయ్య, నలమాటి ఆనంద్, గండేపల్లి ఎండిఓ హరికృష్ణ సత్యారెడ్డి, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి ఎస్సైలు శివనాగబాబు, రఘునాథరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ఇదేనా ?

- **అభివృద్ధి పేరుతో సిమెంట్ రోడ్డు తవ్వారు..**
- **అలానే వదిలేసారు..**

**అంబాజీపేట, పెన్ పవర్, మే 15:**గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నా నాయకులు, అధికారులు ఆదిశగా అడుగులు వేయడంలేదని ప్రజలు మండిపడుతున్నారు.

అభివృద్ధి పేరుతో ఉన్న సిమెంట్ రోడ్డు పై సెంటర్ డ్రైనేజీ నిర్మించేందుకై సిమెంట్ రోడ్డుని అడ్డంగా వదిలేసారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. మండలంలోని మాచవరం గ్రామపంచాయితీ పరిధి స్త్రీల ఆసుపత్రి వద్ద ఉన్న దొమ్మేటివారి పాలెంలోని దుస్థితి ఇది. పంచాయితీ సర్పంచులు పదవీకాలం ముగుస్తున్న చివరి దశలో అభివృద్ధి పేరుతో హడావుడిగా మొదలైన ఈ డ్రైనేజీ పనులు ఆరంభంలోనే ఆగిపోయాయి. ఇలా గోతులు తవ్వి వదిలేయడంతో రెండునెలలుగా చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక నివాసులు వాపోతున్నారు. పలుమార్లు పిల్లలు, వృద్దులు ఈ గోతిలో పడ్డ సందర్భాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ రోడ్డులో వాహనాలు నడిపేందుకు వీలులేక అవస్తలు పడుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యని పరిస్కరించాలని కోరుతున్నారు.

## కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు 62వ జన్మదిన వేడుకలు

**అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు**





**ఆత్రేయపురం పెన్ పవర్ మే 15:**ర్యాలి గ్రామంలో బండారు సత్యానందరావు 62వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు పేర్చర్ల పుల్లంరాజు వర్మ అధ్యక్షతన, గ్రామ టీడీపీ అధ్యక్షులు పెండెం వెంకన్న సమక్షంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద భారీ కేకులు ఏర్పాటు చేసి కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

పార్టీ నాయకులు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మంత్రి పదవి చేపట్టి కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పేషెంట్లకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి




**జగ్గంపేట, పెన్ పవర్, మే 15:** ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ ఇప్పుడు దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ప్రజలకు మరో భారీ దెబ్బగా మారిందని ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలకు నిరసనగా శుక్రవారం జగ్గంపేట మండలం రంగవల్లి నగర్ లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ వాహనం బయటకు తీస్తే చాలు జేబు ఖాళీ అవుతోందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఈ పెరిగిన ధరలు వెంటనే అమలులోకి రావడంతో అర్ధరాత్రి నుంచే దేశంలోని అనేక పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. ఇంకా ఎంత భారం మోపుతారు అంటూ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమలో రంగవల్లి నగర్ నాయకులు డాన్ శీను, సోమరాజు, మంగయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు విద్యాభ్యాసం పై శ్రద్ధ వహించాలి -ఎంఈఓ నాయక్





**గండేపల్లి, పెన్ పవర్, మే 15:**విద్యార్థులు విద్యాభ్యాసంపై శ్రద్ధ వహించాలని గండేపల్లి విద్యాశాఖ అధికారి నాయక్ తెలిపారు. శుక్రవారం మండల పరిధి తాళ్లూరు హై స్కూల్ నందు సప్లమెంటరీ పరీక్షల కోసం ప్రత్యేక విద్యాబోధన పొందుతున్న విద్యార్థులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మండలంలోని ఆరు కాంప్లెక్స్ గాను 82 మంది విద్యార్థులు సప్లమెంటరీ కి మిగిలారని ఇందులో 42 మంది సైన్స్ లో ఫెయిల్ అవ్వడం జరిగిందన్నారు. సంక్రాంతి తర్వాత 100 రోజుల ప్రాణాలికతో 10వ తరగతి విద్యార్థులకు అన్ని పాఠశాలల్లోనూ ప్రత్యేక విద్యాబోధన అందించడం జరిగిందని ఆ విద్యా బోధనలో వెనకబడిన వారు మాత్రమే పూర్తిస్థాయిలో పరీక్షలు రాయలేకపోయారన్నారు. ఈనెల 25వ తారీఖున జరగబోయే సప్లమెంటరీకి పూర్తిస్థాయిలో విద్యార్థులు ఉపాధ్యాయులు అందించే విద్యాబోధనలను అలవర్చుకుని పరీక్షల రాసేందుకు సిద్ధం కావాలని తద్వారా పరీక్షలలో పూర్తి ఫలితాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు తో మాట్లాడుతూ సప్లమెంటరీ విద్యార్థులు ప్రత్యేక బోధనకు రాని యెడల వారి తల్లిదండ్రులతో మాట్లాడి రప్పించవలసిందిగా ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఆరు జడ్పీహెచ్ఎస్ స్కూల్లకు గాను బోధన అందించేందుకు ఉపాధ్యాయులు ఉన్నారని విద్యార్థులు గమనించి తప్పనిసరిగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నూరు శాతం మార్పులు వచ్చే విధంగా విద్యను అభ్యసించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్యే బండారు జన్మదిన వేడుకలు



**కొత్తపేట, పెన్ పవర్ ,మే 15:**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జన్మదినాన్ని పురస్కరించుకొని కొత్తపేట బస్టాండ్ సెంటర్‌లో తెలుగు మహిళ నాయకురాళ్లు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు యల్లమెల్లి చంద్రకుమారి ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరల పంపిణీ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రోత్సాహం అందిస్తూ వారి అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని నాయకురాళ్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి కృషీవలుడు గిడ్డి సత్యనారాయణ జన్మదిన వేడుకలు



**అంబాజీపేట, పెన్ పవర్, మే 15:** పి. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ 62 వ పుట్టినరోజు కార్యక్రమాన్ని స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న డా.బిఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద గిడ్డి పోలవర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం లో నడిపిస్తూ అభివృద్ధి లో రాష్ట్రము లో 8 వ స్థాన్నాని, జిల్లా లో మొదటి స్థానం లో నిలిపిన ఘనత ఎమ్మెల్యే దే అని నాయకులు కొనియాడారు. కులామతాలకు అతీయతంగా. పార్టీలకు అతీయుతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి లో నిలిపారని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే గ సోదరుడు గిడ్డి ఆనంద్,
పులిదిండి వీర వెంకట సత్యనారాయణ, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, కత్తుల బాబులు, నాగవరపు అన్నవరం, సత్యాల కొండల రావు, నెల్లి వెంకటరమణ, నెల్లి చిన వెంకటేశ్వర్రావు, మూలపర్తి రమేష్, చింత రత్నరాజు, ఒరిగంటి వెంకటరావు, మట్ట వెంకటేశ్వరరావు,కొక్కిరి రవి, కుసుమ శ్రీకాంత్, కోట మురళి, మోకా శ్రీను, నేలపూడి రవి, గిడ్డి రాజారత్నం, గిడ్డి బాలు, నెల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలి సచివాలయంలో కిశోరి వికాసం అవగాహన కార్యక్రమం



**ఆత్రేయపురం పెన్ పవర్ మే 15:**ఆత్రేయపురం మండలం కొత్తపేట ప్రాజెక్టు పరిధిలోని ర్యాలి సచివాలయంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 1 మే 2026 నుండి మనేది వ లెరేఖ వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం రోజుల్లో ప్రతి సచివాలయం పరిధిలో కిశోర బాలబాలికలకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి సిడిపిఓ ఎ. గజలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కిశోర బాలబాలికలు విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. సమాజంలో పెరుగుతున్న బాల్య వివాహాలు, అక్రమ రవాణా వంటి సామాజిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బాలల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పోక్స్ చట్టం గురించి క్లుప్తంగా వివరించి, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

కార్యక్రమంలో బాలబాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి తమ లక్ష్యాలను సాధించాలని అధికారులు ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కె. పద్మావతి, అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది మరియు కిశోర బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు స్థానికులు అధికారులను అభినందించారు.

## ఆదిత్య లో ఎ.పి.ఈ.ఎ.పి సెట్ - 2026 ఎగ్జామ్స్ సెంటర్ ను పరిశీలించిన జె.ఎన్.టి,యు.కె. వి.సి





**గండేపల్లి, పెన్ పవర్, 15:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఎ పి ఈ ఎ పి సెట్ -2026 ఆన్లైన్ ఎగ్జామ్స్ నాల్గవ రోజు ప్రశాంతంగా ముగిసినట్లు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నాల్గవరోజు ఎగ్జామ్ సెంటర్ ను జె.ఎన్.టి.యు.కె. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్.సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆదిత్య కు విచ్చేసిన వైస్ ఛాన్సలర్ కు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా.ఎన్. సతీష్ రెడ్డి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి.శ్రీనివాస్ లు సాదర స్వాగతం పలికారు. ఆదిత్య యూనివర్సిటీ క్యాంపస్ లో ఉదయం 9-00 నుంచి 12-00 వరకు నిర్వహించిన 253 గాను 243 హాజరు కాగా 10 మంది హాజరు కాలేదు. అదేవిధంగా మధ్యాహ్నం 2-00 నుండి 5-00 గంటల వరకు నిర్వహించిన 252 మందికి గాను 248 మంది హాజరు కాగా 4 గురు హాజరు కాలేదు. ఈ ఆన్లైన్ ఎగ్జామ్స్ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆదిత్య యూనివర్సిటీ పూర్తి ఏర్పాట్లను చేసింది. బస్సు ల ద్వారా బ్యాటరీ వెహికల్స్ ద్వారా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఎగ్జామ్స్ కు చీఫ్ సూపరింటెండ్ గా ఆదిత్య ప్రో. వైస్ ఛాన్సలర్ డా. ఆదిరెడ్డి రమేష్ వ్యవహరించగా, డా.పి.శివ సత్యప్రసాద్, ప్రో.టి.శ్రీనివాసులు, ప్రో.వీర ప్రసాద్ కో.ఆర్డినేటర్లు గా వ్యవహరించారు.

# ఆత్రేయపురంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుట్టినరోజు వేడుకలు





**రక్తదాన శిబిరం.. ప్రత్యేక పూజలు.. భారీ కేక్ కట్‌తో సందడి**

**ఆత్రేయపురం పెన్ పవర్ మే 15:**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుట్టినరోజు సందర్భంగా ఆత్రేయపురం మండలంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు చేపట్టి సంబరాలు జరిపారు.ముందుగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణ రాజు, వాడపల్లి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, అనపర్తి నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణ తదితరులు కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ప్రజలకు మరింత సేవ చేయాలని ప్రార్థనలు చేశారు.

అనంతరం లొల్లలాకుల వద్దకు చేరుకున్న నాయకులు బ్రిటిష్ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ట్రస్ట్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 62 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు రామకృష్ణరాజు సైతం రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు.

ఇదే సందర్భంగా ప్రజలకు తాగునీరు అందించేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యకర్తల కోలాహలం మధ్య భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను ఉత్సాహంగా జరిపారు. పలువురు నాయకులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కూసంపూడి రామకృష్ణరాజు మాట్లాడుతూ గత రెండేళ్లలో ఆత్రేయపురం మండల అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు విశేష కృషి చేశారని కొనియాడారు. వాడపల్లి దివ్యక్షేత్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. లొల్లలాకుల పునర్నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయించారని గుర్తుచేశారు. వసంతవాడ వద్ద నాలుగు నియోజకవర్గాలకు తాగునీరు అందించే అమరజీవి జలధార పనులకు శంకుస్థాపన చేయడం అభినందనీయమన్నారు. డ్రాగన్ పడవల పోటీల నిర్వహణ ద్వారా ఆత్రేయపురం పేరు రాష్ట్రవ్యాప్తంగా మారుమోగేలా చేశారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ భోజన ఏర్పాట్లు చేశారు.





## పీజీఈసెట్, జీప్యాట్ & క్యాట్ - 2026 లో ఆదిత్య ఫార్మసీ కళాశాలల విద్యార్థుల ప్రతిభ





**గండేపల్లి, పెన్ పవర్, మే 15:**గండేపల్లి మండలం సూరంపాలెం లో ఆదిత్య ఫార్మసీ విద్యాసంస్థల విద్యార్థులు ఎం.ఫార్మసీ కోర్సులో ప్రవేశం కొరకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పీజీఈసెట్ 2026 లో, జాతీయ స్థాయిలో నిర్వహించిన జీప్యాట్ మరియు క్యాట్ 2026 లో ఉత్తమ ఫలితాలు సాధించారని ఆదిత్య విశ్వవిద్యాలయం డిప్యూటీ ప్రో-చాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు
యేగి శిరీష పీజీఈసెట్ లో రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంక్ సాధించగా, తెలగారెడ్డి శ్రీవల్లి 106వ ర్యాంక్ సాధించింది. వీరిద్దరూ జాతీయ స్థాయిలో నిర్వహించిన జీప్యాట్ పరీక్ష లో కూడా అర్హత సాధించి స్కూల్ ఆఫ్ ఫార్మసీ సత్తా ను మరొక సారి చాటారు. మొత్తంగా 53 మందికి పైగా విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్థాయిలో నిర్వహించిన పీజీఈసెట్ 2026 లో ర్యాంకులు సాధించగా, జాతీయ స్థాయిలో నిర్వహించిన జీప్యాట్ లో ముగ్గురు(3) మరియు క్యాట్లో ఒక (1) విద్యార్థి అర్హత సాధించారు.ఈ సందర్భంగా ఆదిత్య విశ్వవిద్యాలయం, ప్రో-చాన్సలర్, డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి , విద్యార్థులను అభినందిస్తూ, వారి కృషి, తల్లిదండ్రుల సహకారం మరియు అధ్యాపకుల మార్గదర్శకత్వం ఈ విజయానికి కారణమని తెలిపారు.స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ డాక్టర్ డి. సతీష్ కుమార్ మరియు ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె రవి శంకర్ విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## వి.కె.రాయపురం లో "బడి పిలుస్తుంది"





**కార్యక్రమం ద్వారా పలువురు విద్యార్థులు చేరిక**

**గండేపల్లి, పెన్ పవర్, మే 15:** వీకే రాయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలు సంయుక్తంగా "బడిపిలుస్తుంది" కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది. ప్రతీ ఇంటికి వెళ్లి 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చమని, అనేక సౌకర్యాలు కల్పించడం తో పాటు డిజిటల్ ఎడ్యుకేషన్ కూడా ప్రభుత్వం అందిస్తూ ఉన్నత ఫలితాలు సాధిస్తున్న సర్కారు బడిలో తమ పిల్లలను చదివించమని తల్లి తండ్రులను కోరారు. ఈ డ్రైవ్ లో పలువురు విద్యార్థులు పాఠశాలలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మురళీ కృష్ణ, వీకే రాయపురం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు నారాయణ, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె . శ్రీనివాస్, జె. రమణమ్మ,తోటకూర వి వి సత్యనారాయణ మరియు ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించండి -ఎంఈఓ నాయక్

**గండేపల్లి, పెన్ పవర్, మే 15:**ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించాలంటూ శుక్రవారం స్థానిక ఎం ఈ ఓ నాయక్ విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. బడి పిలుస్తోంది లో భాగంగా ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు కలిసి గృహ సందర్శన చేశారు

ఈ సందర్భంగా ఎంఈఓ నాయక్ మాట్లాడుతూ మండలంలోని మూడు క్లస్టర్లో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సొపాధ్యాయులు ... ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులను చేర్చి ఉన్నారు . తాళ్లూరు ,
నీలాద్రి రావు పేట ,ఓ రాగం పేట, సూరంపాలెం గ్రామాల్లో మండల విద్యాశాఖ అధికారులు కేహెచ్ నాయక్ మరియు కే వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు మల్లేపల్లి మరియు నాయకంపల్లి వారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది ..

ఇందులో భాగంగా ఈరోజు 5 మంది అంగన్వాడి మరియు 6 ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ అయినారు ..





ముఖ్యంగా ప్రభుత్వం మన ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయుచున్న కార్యక్రమాలు విద్యార్థి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ ఈ కార్యక్రమం జరిగింది ప్రతిరోజు కూడా మండలంలో అన్ని క్లస్టర్స్ లో ఈ కార్యక్రమాన్ని జరుపుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు చేరే విధంగా మండల విద్యాశాఖ రోజువారి ప్రణాళిక అమలు అమలు చేయాలని ఇట్లు ఎంఈఓ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులతోపాటు అంగన్వాడీ కార్యకర్తలు వై వి లక్ష్మి, చిన్నారి, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com